


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక    ప్రశ్నించడం మన హక్కు





సంపుటి : 1  సంచిక : 286  పేజీలు : 8  సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ)  పచురణ : తాడేపల్లిగూడెం  శనివారం 22 ఆగస్టు 2026  వెల : 1/-రూ ॥

VOLUME :1  ISSUE : 286  PAGES : 8  EDITOR : G. A. RAO ( ANAND GANTYADA )  PUBLISHED : THADEPALLI GUDEM  SAT 22 AUGUST 2026  PRICE : 1/- RS

Simultaneously Published form : Thadepalligudem, Dr. B.R. Ambedkar Konasema Dist, Narasarao Peta,Bapatla,Visakhapatnam,Kakinada,Ongole, Kadapa,,SPSR Nellore, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur, Tirupati,Chittor,Kurnool,Anantapur

## ఎకరం రూ.264 కోట్లు.. రాయదుర్గంలో ఆల్ టైమ్ రికార్డు ధర

- రాయదుర్గంలో ఎకరాకు రూ. 264 కోట్లతో కొత్త భూ రికార్డు
- ఒక్క ప్లాట్ వేలంతో టీజీఐఐసీకి రూ. 1,386 కోట్ల ఆదాయం
- గత మే నెలలో నమోదైన రూ. 237 కోట్ల రికార్డు బద్ధలు
- ఐటీ కారిడార్‌లో ఉండటంతో రియల్ ఎస్టేట్ సంస్థల తీవ్ర పోటీ
- ఆగస్టు 28న మరో ప్లాట్‌కు వేలం జరగనున్నట్లు ప్రకటన



**పెన్ పవర్ డెస్క్:** హైదరాబాద్ రియల్ ఎస్టేట్ రంగంలో సరికొత్త రికార్డు నమోదైంది. రాయదుర్గంలో తెలంగాణ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ (TGIIC) నిర్వహించిన వేలంలో ఎకరా భూమి ఏకంగా రూ. 264 కోట్లు పలికింది. మొత్తం 5.25 ఎకరాల ప్లాట్ విక్రయం ద్వారా ప్రభుత్వ సంస్థ అయిన టీజీఐఐసీకి రూ. 1,386 కోట్ల భారీ ఆదాయం సమకూరింది. హైదరాబాద్‌లో భూమి ధరకు సంబంధించి ఇదే ఆల్ టైమ్ రికార్డ్.రాయదుర్గం పాన్‌మక్తాలోని సర్వే నెం. 83/1లో ఉన్న ప్లాట్ నెం. P1 కోసం శుక్రవారం

- మిగతా 2లో



## దేశంలో పెరుగుతున్న స్వైన్ ఫ్లూ..

### కేంద్ర ఆరోగ్య మంత్రి జేపీ నడ్డా సమీక్ష

- జాతీయ స్థాయి సన్నద్ధత, నివారణ చర్యలపై నడ్డా సమీక్ష
- నిరంతర నిఘా, వ్యాధి వ్యాప్తి నిరోధక చర్యలను సమీక్షించిన నడ్డా
- వ్యాధి లక్షణాలున్నవారిని ముందస్తుగా గుర్తించడం కీలకమన్న కేంద్ర మంత్రి

**పెన్ పవర్ డెస్క్:**దేశంలో స్వైన్ ఫ్లూ కేసులు నమోదవుతున్న నేపథ్యం లో, జాతీయ స్థాయి సన్నద్ధత, నివారణ చర్యలపై కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డా ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. దేశవ్యాప్తంగా నిరంతర నిఘా, వ్యాధి వ్యాప్తి నిరోధక చర్యలు పటిష్ఠంగా

- మిగతా 2లో



## 22 మంది భారతీయులు ఉన్న రెండు నౌకలు హైజాక్

**పెన్ పవర్ డెస్క్:** యెమెన్, సోమాలియా తీరాల్లో వేర్వేరు ఘటనల్లో.. 22 మంది భారతీయుల తో ప్రయాణిస్తోన్న రెండు వాణిజ్య నౌకలను సముద్రపు దొంగలు హైజాక్ చేశారు . ఈ విషయాన్ని సోమాలియా షిప్పింగ్ మంత్రిత్వ శాఖ వెల్లడిం చింది. అధికారులు

- మిగతా 2లో

## ఈరోజుల్లో అందరికీ షుగర్ ఉంది.. పంచదార రేటు పెరిగినా పెద్ద మేటర్ కాదు

### బీహార్ మంత్రి ప్రకటన





**పెన్ పవర్ డెస్క్:** దేశవ్యాప్తంగా గత వారం రోజులుగా చక్కె ర ధరలు పెరుగుతున్న క్రమంలో.. ఈ పరిణామంపై బీహార్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శ్రావణ్ కుమార్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఈరోజుల్లో ప్రతీ ఒక్కరికీ డయాబెటిస్

- మిగతా 2లో

## బౌద్ధ ఆశ్రమంపై సైనిక దాడి.. 14 మంది మృతి

- బౌద్ధ ఆశ్రమంపై సైన్యం వైమానిక దాడి
- ధ్యాన కార్యక్రమంలో పాల్గొన్న 14 మంది మృతి, 20 మందికి గాయాలు
- సగయింగ్ రీజియన్‌లో శుక్రవారం ఉదయం ఈ ఘటన
- మృతుల్లో ముగ్గురు మహిళలు ఉన్నట్లు వెల్లడి

- మిగతా 2లో





## ఆయుర్వేద చికిత్స కోసం నేడు కేరళ వెళుతున్న పవన్ కల్యాణ్

- భుజం నొప్పికి చికిత్స కోసం కేరళకు పవన్ కల్యాణ్
- శస్త్రచికిత్స తర్వాత విశ్రాంతి పెద్దగా తీసుకోకుండా విధుల్లో చేరిక
- భుజానికి వాపు, జ్వరం రావడంతో వైద్యుల సూచన
- కేరళకు బయలుదేరనున్న ఉపముఖ్యమంత్రి
- ఆయుర్వేద చికిత్సతో పూర్తిస్థాయిలో కోలుకోవడమే లక్ష్యం

**పెన్ పవర్ డెస్క్:**ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ రేపు కేరళకు పయనం కానున్నారు. తన భుజం నొప్పికి ఆయుర్వేద చికిత్స తీసుకునే నిమిత్తం ఆయన శనివారం కేరళకు వెళ్లనున్నట్లు జనసేన పార్టీ ఒక ప్రకటనలో వెల్లడించింది.ఇటీవల పవన్ కల్యాణ్ తన కుడి భుజం 'రొటేటర్ కఫ్' గాయానికి ముంబైలో శస్త్రచికిత్స చేయించుకున్న సంగతి తెలిసిందే. శస్త్రచికిత్స అనంతరం కొంతకాలం పాటు పూర్తి విశ్రాంతి తీసుకోవాలని, అధికారిక కార్యక్రమాలకు దూరంగా ఉండాలని వైద్యులు ఆయనకు సూచించారు.అయితే, పరిపాలనా బాధ్యతల దృష్ట్యా పవన్ కల్యాణ్ శస్త్రచికిత్స జరిగిన వారంలోపే తిరిగి విధుల్లో చేరారు. ముందస్తుగా నిర్ణయించిన ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొనడంతో పాటు, శాఖాపరమైన సమీక్షలు, పార్టీ అంతర్గత సమావేశాలను ఆయన నిర్వహించారు.విశ్రాంతి లేకుండా విధుల్లో పాల్గొనడం వల్ల ఆయన భుజానికి వాపు రావడంతో

- మిగతా 2లో



## వైకాపా ఎంపీ అవినాష్ నివాసంలో రూ.24లక్షల నగదు సీజ్

- వివేకా హత్య కేసు: అవినాష్ రెడ్డి నివాసంలో ముగిసిన ఈడీ సోదాలు
- వివేకా హత్య కేసులో ఈడీ దర్యాప్తు ముమ్మరం
- ఎంపీ అవినాష్ రెడ్డి, ఆయన తండ్రి నివాసాల్లో సోదాలు
- మనీ లాండరింగ్ కోణంలో ఏకకాలంలో 7 చోట్ల తనిఖీలు
- కీలక పత్రాలు, డిజటల్ పరికరాలను సీజ్ చేసిన అధికారులు

**మాజీ మంత్రి వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసుకు సంబంధించి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దర్యాప్తును వేగవంతం చేసింది. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న కడప ఎంపీ వైఎస్ అవినాశ్ రెడ్డితో పాటు మరికొందరి నివాసాలు, కార్యాలయాలపై శుక్రవారం ఈడీ అధికారులు మెరుపుదాడులు నిర్వహించారు.**

- మిగతా 2లో

ఈడీ హైదరాబాద్ జోనల్ కార్యాలయ అధికారులు మనీ లాండరింగ్ నిరోధక చట్టం కింద ఈ తనిఖీలు చేపట్టారు. హైదరాబాద్, కడప జిల్లా పులివెందులలో కలిపి మొత్తం ఏడు ప్రాంతాల్లో ఏకకాలంలో సోదాలు జరిగాయి.

హైదరాబాద్‌లోని కోకాపేటలో ఉన్న అవినాశ్ రెడ్డి విల్లా, పులివెందులలోని ఆయన నివాసంతో పాటు, ఆయన తండ్రి వైఎస్ భాస్కర్ రెడ్డికి చెందిన పులివెందుల భాకరాపురంలోని ఇంట్లోనూ అధికారులు తనిఖీలు చేశారు. మొదట భాస్కర్ రెడ్డి ఇల్లు తాళం వేసి ఉండటంతో, బంధువులను పిలిపించి దానిని తెరిపించారు.

వీరితో పాటు సీబీఐ చార్జ్‌షీట్‌లో పేర్లు ఉన్న దేవిరెడ్డి శివశంకర్ రెడ్డి, యెర్ర గంగిరెడ్డి, సునీల్ యాదవ్, షేక్ దస్తగిరి నివాసాల్లో కూడా ఈడీ సోదాలు నిర్వహించింది. ఈ తనిఖీల సందర్భంగా పలు కీలక పత్రాలు, డిజిటల్ పరికరాలను స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం.



## ప్రముఖ నటి షావుకారు జానకి కన్నుమూత

- నేడు చెన్నైలో షావుకారు జానకి అంత్యక్రియలు
- 94 ఏళ్ల వయస్సులో పద్మశ్రీ షావుకారు జానకి కన్నుమూత
- చెన్నైలో శనివారం మధ్యాహ్నం జరగనున్న అంత్యక్రియలు
- ఏడు దశాబ్దాల కెరీర్‌లో 400కు పైగా చిత్రాల్లో నటించిన జానకి

**పెన్ పవర్ డెస్క్:**ప్రముఖ సీనియర్ నటి, పద్మశ్రీ పురస్కార గ్రహీ త షావుకారు జానకి (94) అంత్యక్రియలు శని వారం మధ్యాహ్నం

- మిగతా 2లో



## ప్రణయ్ తేజ్ ఘటన నుంచి ఇంకా తేరుకోలేకపోతున్నాను

- విశాఖ చిన్నారి ప్రణయ్ తేజ్ మృతి ఘటనపై మంత్రి లోకేశ్ తీవ్ర ఆవేదన
- ఒక తండ్రిగా ఆ తల్లిదండ్రుల బాధను ఊహించలేకపోతున్నానని వ్యాఖ్య
- పాఠశాలల్లో శారీరక దండనలకు చోటులేదని స్పష్టీకరణ
- ఘటనపై పూర్తిస్థాయి విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశం

**పెన్ పవర్ డెస్క్:**పాఠశాల విద్యార్థి ప్రణయ్ తేజ్ మృతి ఘటనపై ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తీవ్ర దిగ్భ్రాంతి, ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటన తనను

- మిగతా 2లో

## ఈనెల 29 నుంచి సీడ్ యాక్సెస్ రోడ్డు మూడో దశ పనులు



- ప్రస్తుతం ఇన్నర్ రింగ్ రోడ్డు, రైల్వే లైన్ పనులపై దృష్టి సారించామన్న నారాయణ
- ఆ తర్వాత విమానాశ్రయం నిర్మాణంపై నిర్ణయం తీసుకుంటామని వెల్లడి
- ఇకపై ప్రతినెలా ఒక టవర్ పూర్తయ్యేలా ప్రణాళికలు రూపొందించామన్న మంత్రి

- మిగతా 2లో

## నాకు స్వాగతం పలుకుతున్నారేమో అనుకున్నా!

### మండలిలో తొలి రోజు అనుభవంపై వర్ల రామయ్య ఆవేదన

- గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా టీడీపీ సీనియర్ నేత వర్ల రామయ్య
- తొలి రోజు అనుభవం ఒక పీడకల అంటూ వ్యాఖ్యలు
- పెద్దల సభలో వైసీపీ సభ్యులు గద్దల్లా వ్యవహరించారని విమర్శలు
- దళిత చైర్మన్‌ను అవమానిస్తూ సభా గౌరవాన్ని దెబ్బతీస్తున్నారని ఆగ్రహం
- మెగా డీఎస్సీపై తప్పుడు ఆరోపణలతో నిరుద్యోగులను భయపెడుతున్నారని వెల్లడి
- జగన్ ప్రోత్సాహంతోనే సభలో వైసీపీ సభ్యులు రచ్చ చేస్తున్నారని ఆరోపణ

- మిగతా 2లో



## ఎడిటర్ వ్యూ

### "బలగం" బరిలోకి దిగుతుందా?

ఆంధ్రప్రదేశ్‌లో త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలు తెలుగుదేశం పార్టీ (టీడీపీ) ప్రభుత్వానికి ప్రతిష్టాత్మకంతో పాటు ఎంతో సవాల్ గా మారనున్నాయి. అసెంబ్లీ ఎన్నికల్లో ఘన విజయం సాధించిన కూటమి ప్రభుత్వం, ఇప్పుడు గ్రామం నుంచి మున్సిపల్ స్థాయి వరకు పార్టీ యంత్రాగాన్ని బలోపేతం చేయాల్సిన అవసరం ఉంది. కూటమి ప్రభుత్వం ఏర్పాటయి రెండేళ్లు కావస్తుంది. కార్యకర్తల్లో ఎన్నికలకు ముందు ఉత్సాహం లేదు. పదవులు లేవు. వారికి సరైన పనులు దక్కడం లేదు. ఇప్పటికీ అనేక నియోజకవర్గాల్లో వైసీపీ నేతలదే పెత్తనమని కార్యకర్తల నుంచి ద్వితీయ శ్రేణి నేతల వరకూ భావిస్తున్నారు. వీరు స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎంత మేరకు కమిట్ మెంట్ తో పనిచేస్తారన్నది మాత్రం లోలోపల పార్టీ నేతలకు కూడా సందేహంగానే కనిపిస్తుంది.

**అప్పుడు అలా.. ఇప్పుడు మరొకలా...**

తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాకముందు ఒకలా... వచ్చిన తర్వాత మరొకలా వ్యవహరిస్తుంది. గత సాధారణ ఎన్నికల్లో ప్రాణాలకు తెగించి పోలింగ్ కేంద్రాల వద్ద కార్యకర్తలు పోరాడారు. కానీ అధికారంలోకి వచ్చిన తర్వాత మాత్రం పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తలను పట్టించుకోవడం లేదు. ముఖ్యంగా పార్టీ అగ్రనాయకత్వం హెచ్చరికలు చేస్తున్నా అత్యధిక సంఖ్యలో ఉన్న టీడీపీ శాసనసభ్యులు తమకు ఆర్థిక ప్రయోజనాలు చేకూర్చే వారికే పనులు కట్టబెడుతున్నారు కానీ, పార్టీ కోసం పనిచేసిన కార్యకర్తల కష్టాన్ని మాత్రం గుర్తించడం లేదన్న అభిప్రాయం ఉంది. అధికారంలోకి వచ్చిన తర్వాత తమకు ఒరిగిన ప్రయోజనమేమీ లేదని బహిరంగంగానే పార్టీ కార్యకర్తలు సోషల్ మీడియా ద్వారా వాపోతున్నారు. కానీ వారి గోడును మాత్రం పట్టించుకోవడం లేదు. కూటమి నేతల మధ్య సయోధ్య లేకపోవడం కూడా మరొక తలనొప్పిగా తయారు కావచ్చు.

**ఎమ్మెల్యేలపై ఆరోపణలు...**

మరొకవైపు ఎమ్మెల్యేల అవినీతి, అక్రమాలను కూడా చూసీ చూడనట్లు పార్టీ నాయకత్వం వదిలేస్తుండటాన్ని కార్యకర్తలు ఆగ్రహంతో ఉన్నారు. టీడీపీకి బూత్ లెవెల్ లో భారీ బలగం ఉన్నప్పటికీ స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎంత మేరకు కసి తీరా పనిచేస్తుందన్నది మాత్రం సందేహంగానే ఉంది. మరొకవైపు ప్రత్యక్ష ఎన్నికల విధానం కూడా పార్టీకి నష్టం తెచ్చి పెడుతుందని అంటున్నారు. బీసీ నినాదం ఎత్తుకున్నా అవి న్యాయస్థానాలు ఎంత మేరకు అంగీకరిస్తాయన్నది కూడా అనుమానమే. ఇప్పటికే రిజర్వేషన్లపై హైకోర్టు చేసిన వ్యాఖ్యలు చూస్తే 34 శాతం బీసీ రిజర్వేషన్లతో ఈ ఎన్నికలకు వెళ్లే అవకాశాలు కనిపించడం ల్లు. స్థానిక సంస్థల్లో 34శాతం బీసీ రిజర్వేషన్ల అమలును ప్రతిష్టాత్మకంగా తీసుకున్నప్పటికీ, న్యాయపరమైన చిక్కులు రాకుండా ఎన్నికలు నిర్వహించడం ప్రభుత్వానికి పెద్ద సవాల్. అయితే 16వ ఆర్థిక సంఘం నిధులను పొందడానికి, సకాలంలో స్థానిక సంస్థల పాలనను పునరుద్ధరించడం కోసం ఎన్నికలు నిర్వహించడం అవసరం. అందుకే స్థానిక సంస్థల ఎన్నికలు టీడీపీకి ఛాలెంజ్ అనే చెప్పాలి.

## ప్రణయ్ తేజ్ ఘటన నుంచి ఇంకా తేరుకోలేకపోతున్నాను

- మొదటి పేజి తరువాయి

తీవ్రంగా కలచివేసిందని, క్రమశిక్షణ పేరుతో చిన్నారులపై హింసకు పాల్పడటాన్ని ఎట్టిపరిస్థితుల్లోనూ సహించబోమని ఆయన స్పష్టం చేశారు. ఈ మేరకు ఆయన తన సోషల్ మీడియా ఖాతాలో ఒక పోస్ట్ పెట్టారు."ఒక తండ్రిగా, విశాఖ చిన్నారి ప్రణయ్ తేజ్‌కు జరిగిన ఘటన గురించి నేను ఇంకా తేరుకోలేకపోతున్నాను. అతని తల్లిదండ్రులు అనుభవిస్తున్న బాధను ఊహించుకోలేను. మన పాఠశాలల్లో శారీరక దండనలకు ఏమాత్రం చోటు లేదు. క్రమశిక్షణ పేరుతో ఏ బిడ్డపైనా హింస జరగకూడదు" అని లోకేశ్ తన పోస్టులో పేర్కొన్నారు.ఈ దురదృష్టకర ఘటనపై ఇప్పటికే పూర్తిస్థాయి విచారణకు ఆదేశించినట్లు మంత్రి తెలిపారు. బాధ్యులుగా తేలిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. ఈ తీవ్రమైన దుఃఖ సమయంలో ప్రణయ్ కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నట్లు లోకేశ్ పేర్కొన్నారు.ఈ ఘటనకు సంబంధించి ఇండియా టుడేలో ప్రచురితమైన కథనాన్ని తన సోషల్ మీడియా ఖాతాలో పంచుకుంటూ లోకేశ్ ఈ విధంగా స్పందించారు. మంత్రి ఆదేశాలతో విద్యాశాఖ అధికారులు ఈ ఘటనపై దృష్టి సారించినట్లు తెలుస్తోంది.

# నాకు స్వాగతం పలుకుతున్నారేమో అనుకున్నా!

శాసనమండలిలో తన తొలిరోజు అనుభవం ఓ పీడకలలా మిగిలిపోయిందని, పెద్దల సభలో వైసీపీ సభ్యులు "పెద్దల్లా" కాకుండా "గద్దల్లా" వ్యవహరించి సభా గౌరవాన్ని మంటగలిపారని నూతన ఎమ్మెల్సీ, టీడీపీ సీనియర్ నేత వర్ల రామయ్య తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలపై చర్చించి, చట్టాలను సమీక్షించాల్సిన మండలిలో నినాదాలు, గందరగోళంతో ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారని ఆయన ధ్వజమెత్తారు. శుక్రవారం మంగళగిరిలోని ఎన్టీఆర్ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కౌన్సిల్‌లో వైసీపీ సభ్యుల తీరు తనను తీవ్ర నిరుత్సాహానికి గురిచేసిందన్నారు.ముందుగా, తనను గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా ఎంపిక చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు, ఆమోదం తెలిపిన గవర్నర్‌కు వర్ల రామయ్య కృతజ్ఞతలు తెలిపారు. తాను ప్రమాణ స్వీకారం చేసిన రోజు సభ వాయిదా పడగా, ఎమ్మెల్సీగా కార్యకలాపాల్లో పాల్గొనేందుకు నిన్న తొలిసారి సభలో అడుగుపెట్టానని చెప్పారు.

"సభలోకి అడుగుపెట్టగానే పెద్ద ఎత్తున గందరగోళం కనిపించింది. కొత్త సభ్యుడిగా నాకు స్వాగతం పలుకుతున్నారేమో అని తొలుత భావించాను. కానీ, కాసేపటికే వైసీపీ సభ్యులు సభా కార్యక్రమాలను అడ్డుకుంటున్నారని అర్థమైంది. ఛైర్మన్ మోషేన్ రాజు ఆసీనులై ఉండగా, ఆయనకు ఇరువైపులా నిలబడి, ముఖానికి అడ్డంగా ప్లకార్డులు పెట్టి, మైక్రోఫోన్ లాక్కొని పెద్దగా నినాదాలు చేశారు. వారి ప్రవర్తన చూసి తీవ్రంగా కలత చెందాను" అని తన తొలిరోజు అనుభవాన్ని వివరించారు.

**దళిత ఛైర్మన్‌ను అవమానిస్తున్నారు**

దళిత వర్గానికి చెందిన ఛైర్మన్ మోషేన్ రాజును వైసీపీ సభ్యులు ఉద్దేశపూర్వకంగా అవమానిస్తున్నారని రామయ్య ఆరోపించారు. "ఒక దళిత నాయకుడు ఆ స్థానంలో కూర్చొని సభను నడపడం వారికి ఇష్టం లేదా? ఆయన వయసును, హోదాను కూడా గౌరవించడం లేదు. ఇది పెద్దల సభ ఔన్నత్యాన్ని దెబ్బతీయడమే. పెద్దరికం వయసుతో రాదు, ప్రవర్తనతో వస్తుంది. 25 ఏళ్ల యువకుడు కూడా తన నడవడికతో పెద్దమనిషి అనిపించుకోవచ్చు. కానీ, మండలిలో వైసీపీ సభ్యుల తీరు అల్లరి మూకలను తలపిస్తోంది" అని మండిపడ్డారు.

**జగన్ ప్రోత్సాహంతోనే ఈ రచ్చ**

ఈ గందరగోళం వెనుక వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రోత్సాహం ఉందని వర్ల రామయ్య సంచలన ఆరోపణలు చేశారు. "సభలో ఎవరు ఎంత గట్టిగా అరిచారు, ఎవరు ఛైర్మన్‌ను ఎంతలా అడ్డుకున్నారు అని సెల్ఫీలు, వీడియోలు తీసుకుని జగన్‌కు పంపుతున్నారు. దానికి ఆయన 'వెరీ గుడ్, యూ ఆర్ పాస్డ్' అని ప్రోత్సహిస్తున్నారు. సభను అడ్డుకోవడానికే జగన్ వారిని పంపించారా? ఇది ప్రజాస్వామ్యమా?" అని ప్రశ్నించారు.

మంత్రి నారా లోకేశ్ పై ఈర్ష్య, ద్వేషంతోనే వైసీపీ నేతలు సభలో అసభ్యకర సైగలు చేస్తూ, అనుచితంగా ప్రవర్తిస్తున్నారని విమర్శించారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 169, 171 ప్రకారం మండలి ఒక సమీక్షా సభ అని, చట్టసభ చేసిన బిల్లులను లోతుగా పరిశీలించి సూచనలు చేయాల్సిన బాధ్యత ఉందని గుర్తుచేశారు. అలాంటి సభను వ్యక్తిగత కక్ష సాధింపులకు వేదికగా మార్చడం దుర్మార్గమన్నారు.

**లోకేశ్ సవాల్ కు బదులేదీ?**

మెగా డీఎస్సీపై వైసీపీ చేస్తున్న ఆరోపణలను వర్ల రామయ్య తీవ్రంగా ఖండించారు. "మంత్రి నారా లోకేశ్ బహిరంగ చర్చకు సిద్ధమని సవాల్ విసిరితే వైసీపీ నేతలు పారిపోయారు. డీఎస్సీలో అవినీతి జరిగిందని ఆరోపణలు చేస్తున్నవారు ఆధారాలు చూపాలి. ఇప్పటికే సంబంధిత శాఖల ఉన్నతాధికారులు అజయ్ జైన్, స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ మీడియా సమావేశాలు పెట్టి ప్రతీ అంశాన్ని స్పష్టంగా వివరించారు. అయినా అనుమానాలుంటే కార్యాలయానికి వచ్చి నివృత్తి చేసుకోవచ్చని కూడా చెప్పారు. కానీ, వైసీపీ నేతలు వాస్తవాలు తెలుసుకోకుండా నిరుద్యోగులను, ఇప్పటికే ఉద్యోగాలు పొందిన ఉపాధ్యాయులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారు" అని ఆగ్రహం వ్యక్తం చేశారు.మెగా డీఎస్సీపై హైకోర్టులో 341 పిటిషన్లు దాఖలు కాగా, వాటన్నింటినీ న్యాయస్థానం కొట్టివేసిందని గుర్తుచేశారు. "ఆధారాలుంటే కోర్టుకు వెళ్లాలి, అంతేగానీ ఏడాది క్రితం ఉద్యోగాలు సాధించిన వారిని మానసికంగా వేధించడం సరికాదు. మీ రాజకీయాల కోసం వారి జీవితాలతో ఆడుకోవద్దు" అని హితవు పలికారు.

**కౌరవులు వందమంది.. ఏం ఉపయోగం!**

మహాభారతంలో పాండవులు ఐదుగురే ఉన్నా ధర్మం వైపు నిలబడి గెలిచారని, వందమంది కౌరవులు అధర్మం వైపు ఉండి ఓడిపోయారని రామయ్య ఉదహరించారు. "సభలో మా సంఖ్య తక్కువగా ఉండొచ్చు, కానీ మేము ప్రజల పక్షాన, ధర్మం వైపు ఉన్నాం. వైసీపీ తన తీరు మార్చుకోకపోతే కౌరవుల గతే పడుతుంది. ఇప్పటికైనా జగన్ తన ఎమ్మెల్సీలకు దిశానిర్దేశం చేసి, సభా గౌరవాన్ని కాపాడేలా చూడాలి. రాబోయే సమావేశాల్లోనైనా వారు పెద్దల సభ సభ్యుల్లా హుందాగా వ్యవహరిస్తారని ఆశిస్తున్నాను" అని వర్ల రామయ్య పేర్కొన్నారు.

## ఈనెల 29 నుంచి సీడ్ యాక్సెస్ రోడ్డు మూడో దశ పనులు

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయి. కీలకమైన సీడ్ యాక్సెస్ రహదారి మూడో దశ పనులపై మంత్రి నారాయణ ప్రకటన చేశారు. ఈ నెల 29వ తేదీన మూడో దశ పనులు ప్రారంభిస్తామని వెల్లడించారు. గుంటూరు జిల్లా తుళ్లూరులోని వందల ఏళ్ల చరిత్ర కలిగిన శ్రీ గంగా పార్వతీ సమేత శ్రీ రామలింగేశ్వర స్వామి, శ్రీ బాలకోటేశ్వర స్వామి ఆలయాల పునఃప్రతిష్ఠ మహోత్సవంలో మంత్రి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. గతంలో రాజధాని రైతులు అమరావతి పరిరక్షణ కోసం చేపట్టిన 'న్యాయస్థానం టు దేవస్థానం' పాదయాత్ర ఇదే తుళ్లూరు ఆలయం నుంచే ప్రారంభమై విజయవంతమైందని మంత్రి గుర్తుచేశారు. రైతుల త్యాగాల పునాదులపైనే అమరావతి మళ్లీ పునర్నిర్మాణం అవుతోందన్నారు. రాజధాని నిర్మాణంలో భాగమైన ఇన్నర్ రింగ్ రోడ్డు, రైల్వే లైన్ పనులపై ప్రస్తుతం ప్రధానంగా దృష్టి సారించామని, ఆ తర్వాత విమానాశ్రయం నిర్మాణ అంశంపై తుది నిర్ణయం తీసుకుంటామని చెప్పారు.

అమరావతి పరిపాలనా నగరంలో టవర్ల నిర్మాణాన్ని వేగవంతం చేస్తూ ప్రతినెలా ఒక్కో టవర్ నిర్మాణాన్ని పూర్తి చేసేలా ప్రణాళికలు రూపొందించినట్లు చెప్పారు. అలాగే, రాజధాని రైతుల రిటర్నబుల్ ప్లాట్ల అభివృద్ధి పనులకు సంబంధించి ఈ నెల 27న టెండర్లు ఓపెన్ చేస్తున్నామని, ప్రక్రియ పూర్తి కాగానే క్షేత్రస్థాయిలో పనులు వేగంగా మొదలుపెడతామని మంత్రి స్పష్టం చేశారు.

## 22 మంది భారతీయులు ఉన్న రెండు నౌకలు హైజాక్

- మొదటి పేజి తరువాయి

వెల్లడించిన వివరాల ప్రకారం.. ఆగస్టు 17న సోమాలియా తీరంలో కామెరూన్ పతాకంతో వెళ్తోన్న 'లుటుఫ్' అనే కార్గో నౌక హైజాక్ అయ్యింది. తుర్కియే ఆయుధాలను తరలిస్తోన్న ఆ నౌకలో 10 మంది సిబ్బంది ఉండగా.. వారిలో ఆరుగురు భారతీయులు కాగా.. మిగిలిన వారు తుర్కియే, జార్జియా, సెర్బియాకు చెందినవారు. మొగదిషూలోని సైనిక శిక్షణా కేంద్రానికి ఆయుధాలు, కమ్యూనికేషన్, శాటిలైట్ పరికరాలను తరలిస్తుండగా.. సోమాలియా తీరంలో రెండు చిన్న పడవల నుంచి 8మంది సాయుధులు నౌకలోకి ప్రవేశించి హైజాక్ చేశారు. ఆగస్టు 20న మరో ఘటనలో.. యెమెన్ తీరానికి సమీపంలో ఎరిట్రియా జెండాతో వెళ్తోన్న 'ఎం టి సిబు 1' అనే చమురు ఉత్పత్తుల ట్యాంకర్‌ను సముద్ర దొంగలు హైజాక్ చేశారు. ఇందులో ఉన్న 20మంది సిబ్బందిలో 16మంది భారతీయులు కాగా.. మిగిలిన వారు సిరియా, సూడాన్, ఇరాక్‌లకు చెందిన వారు. ప్రస్తుతం వారంతా పైరెట్స్ చెరలోనే ఉన్నారు. ఈ రెండు ఘటనలపై దర్యాప్తు కొనసాగుతోందని.. సముద్రపు దొంగల నుంచి నావికులను సురక్షితంగా విడిపించేందుకు చర్యలు తీసుకుంటున్నామని అధికారులు వెల్లడించారు. ఈ విషయంపై భారత విదేశీ వ్యవహారాల శాఖ స్పందించింది. భారత నావికులందరూ సురక్షితంగానే ఉన్నట్లు ప్రకటించింది.

## ఎకరం రూ.264 కోట్లు.. రాయదుర్గంలో ఆల్ టైమ్ రికార్డు ధర

- మొదటి పేజి తరువాయి

ఈ-వేలం నిర్వహించారు. ఎకరాకు రూ. 175 కోట్ల కనీస ధరతో వేలం ప్రారంభించగా, దానిపై ఏకంగా 50.9 శాతం అధికంగా ధర పలికింది. ఇదే కారిడార్‌లో గత మే నెలలో టీజీఐఐసీ నిర్వహించిన వేలంలో ఎకరాకు రూ. 237 కోట్లు పలికింది. తాజా వేలంలో ఆ రికార్డు బద్దలైంది.హైదరాబాద్ ఐటీ, నాలెడ్జ్ సిటీ గ్రోత్ కారిడార్‌లో ఈ భూమి ఉండటం దీనికి ప్రధాన కారణం. ఐటీసీ కోహినూర్ హోటల్‌కు ఎదురుగా, దుర్గం చెరువు, హైటెక్ సిటీ, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌కు అత్యంత సమీపంలో ఈ ప్లాట్ ఉంది. మల్టీ-యూజ్ జోన్‌గా ఉన్న ఈ భూమి కోసం పలు ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థలు తీవ్రంగా పోటీపడ్డాయి. ఈ వేలంలో పాల్గొనేందుకు బిడ్డర్లు రూ. 10 కోట్ల డిపాజిట్ చెల్లించారు.ఈ భూముల వేలంపై తెలంగాణ హైకోర్టు, సుప్రీంకోర్టుల్లో పలు పిటిషన్లు దాఖలయ్యాయి. ఇక్కడ చారిత్రక రాతి కట్టడాలు ఉన్నాయని, దుర్గం చెరువుకు సమీపంలో ఉన్నాయని, యాజమాన్య హక్కుల వివాదాలు ఉన్నాయని పిటిషనర్లు ఆరోపించారు. అయితే, వేలం ప్రక్రియను నిలిపివేసేందుకు న్యాయస్థానాలు నిరాకరించాయి. ఈ ప్లాట్లు రక్షిత వారసత్వ ప్రాంతాలు, బఫర్ జోన్ల పరిధిలోకి రావని ప్రభుత్వం స్పష్టం చేసింది.గత కొన్నేళ్లుగా రాయదుర్గం ప్రాంతంలో భూముల ధరలు క్రమంగా పెరుగుతున్నాయి. 2025లో ఇక్కడ ఎకరా ధర రూ. 177 కోట్లుగా ఉండేది. ఇప్పుడు అంతకుమించి రికార్డు ధర పలికింది. తాజా డిమాండ్ నేపథ్యంలో, ఇదే సర్వే నంబరులో మరో 5.38 ఎకరాల ప్లాట్‌కు ఆగస్టు 28న వేలం నిర్వహించనున్నట్లు టీజీఐఐసీ ప్రకటించింది. వరుస వేలాలతో రాయదుర్గం

## ఈరోజుల్లో అందరికీ షుగర్ ఉంది.. పంచదార రేటు పెరిగినా పెద్ద మేటర్ కాదు

- మొదటి పేజి తరువాయి

(మధుమేహం) ఉందని.. అందువల్ల పంచదార ధర పెరిగినా పెద్ద ప్రభావం ఏం ఉండకపోవచ్చని ఈ బీహార్ మంత్రి అభిప్రాయం వ్యక్తం చేశారు.ప్రీ-డయాబెటిక్, డయాబెటిక్ కేసులు పెరుగుతున్న కారణంగా ప్రజలు ఎలాగూ చక్కెర వినియోగం విషయంలో జాగ్రత్త పడుతున్నారని.. ఈ క్రమంలో చక్కెర ధర పెరిగినా దేశ ప్రజలపై పెద్దగా ప్రభావం ఉండకపోవచ్చనేది ఈ మంత్రి వ్యాఖ్యల సారాంశం.మధుమేహ రోగుల కేసులు పెరుగుతున్నందున, ప్రజలు స్వీట్లు తినడం లేదని, స్వీట్లు తక్కువగా తింటున్నారని మంత్రి చెప్పారు. విలేకరుల ముందు ఆయన చేసిన ఈ వ్యాఖ్యలు వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. ఇదెక్కడి లాజిక్ అని.. మంత్రి ప్రకటనపై ప్రజలు విస్మయం వ్యక్తం చేశారు. ప్రధాన ప్రతిపక్షమైన ఆర్జేడీ మాత్రం కుమార్‌పై తీవ్రమైన వ్యంగ్యంతో విరుచుకుపడింది.

కప్పు టీతో తమ దినచర్యను ప్రారంభించే లేదా బ్రెడ్ లేదా బిస్కెట్‌ను టీలో ముంచుకుని తాగే సామాన్య ప్రజలు, పెరుగుతున్న చక్కెర ధరల వల్ల తీవ్ర ప్రభావానికి గురయ్యారని ఆర్జేడీ

రాష్ట్ర అధికార ప్రతినిధి ఎజాజ్ అహ్మద్ తెలిపారు. శ్రావణ్ కుమార్ ఒక మంత్రి అయినందు వల్ల.. ఆయన పెరుగుతున్న చక్కెర ధరను భరించగలరని.. అందుకే చక్కెర ధరలపై సామాన్య ప్రజల ఆందోళనలు ఆయనకు హాస్యాస్పదంగానే అనిపించవచ్చని అహ్మద్ అన్నారు.

## వైకాపా ఎంపీ అవినాష్ నివాసంలో రూ.24లక్షల నగదు సీజ్

**కేసు నేపథ్యం**

ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి జగన్ కు బాబాయి అయిన వైఎస్ వివేకానంద రెడ్డి, 2019 మార్చి 15న పులివెందులలోని తన నివాసంలో హత్యకు గురయ్యారు. ఈ కేసును మొదట రాష్ట్ర పోలీసులు దర్యాప్తు చేయగా, 2020 మార్చిలో ఏపీ హైకోర్టు ఆదేశాలతో సీబీఐకి బదిలీ అయింది. ఈ హత్య వెనుక రూ. 40 కోట్ల సుపారీ కుట్ర ఉన్నట్లు అప్రూవర్‌గా మారిన షేక్ దస్తగిరి వాంగ్మూలం ఇచ్చాడు. సీబీఐ దాఖలు చేసిన చార్జ్‌షీట్ల ఆధారంగా, ఈడీ మనీ లాండరింగ్ కోణంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తోంది. హత్యకు సంబంధించిన ఆర్థిక లావాదేవీలు, నిధుల మళ్లింపుపైనే ఈడీ ప్రధానంగా దృష్టి సారించింది. తాజా సోదాలు ఈ దర్యాప్తులో కీలక ముందడుగుగా భావిస్తున్నారు.

## బౌద్ధ ఆశ్రమంపై సైనిక దాడి.. 14 మంది మృతి

మయన్మార్‌లోని సాగైంగ్ ప్రాంతంలో బౌద్ధ ఆశ్రమంపై సైన్యం వైమానిక దాడి చేసినట్లు సమాచారం. శుక్రవారం జరిగిన ఈ దాడిలో 14 మంది మృతి చెందగా.. మరో 20 మంది గాయపడ్డారు. మృతుల్లో ముగ్గురు మహిళలు ఉన్నట్లు స్థానిక వర్గాలు తెలిపాయి.మండలేకు సుమారు 75 కిలోమీటర్ల దూరంలోని స్వెల్ లే ఓహ్ గ్రామంలో ఈ ఘటన చోటుచేసుకుంది. వారంపాటు నిర్వహిస్తున్న ధ్యాన శిబిరంలో 100 మందికి పైగా పాల్గొన్న సమయంలో దాడి జరిగినట్లు సమాచారం. స్థానికుల కథనం ప్రకారం.. యుద్ధ విమానం రెండు బాంబులు జారవిడిచింది. అందులో ఒకటి ఆశ్రమ ప్రాంగణంలో పడగా, మరో బాంబు సమీపంలోని భవనాన్ని ధ్వంసం చేసింది. ఈ ఘటనపై మయన్మార్ సైన్యం నుంచి వెంటనే అధికారిక స్పందన వెలువడలేదు.

## ఆయుర్వేద చికిత్స కోసం నేడు కేరళ వెళుతున్న పవన్ కల్యాణ్

- మొదటి పేజి తరువాయి

పాటు తీవ్రమైన జ్వరం కూడా వచ్చినట్లు జనసేన పార్టీ పేర్కొంది. ఈ నేపథ్యంలో, భుజం నొప్పి నుంచి పూర్తిస్థాయిలో కోలుకోవడానికి కేరళలో ప్రత్యేక ఆయుర్వేద చికిత్స తీసుకోవాలని వైద్యులు సూచించగా, ఆయన రేపు అక్కడకు వెళ్లనున్నట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి.

## దేశంలో పెరుగుతున్న స్వైన్ ఫ్లూ..

- మొదటి పేజి తరువాయి

ఉండాలని ఆయన అధికారులను ఆదేశించారు.ఢిల్లీతో పాటు ఇతర ప్రధాన ప్రాంతాల్లోని ఆసుపత్రులలో బెడ్ల లభ్యత, ఐసోలేషన్ వార్డుల ఏర్పాటుతో పాటు అవసరమైన మందులు, టీకాల లభ్యతపై మంత్రి సమగ్రంగా సమీక్షించారు. నేషనల్ సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్, ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్, హెల్త్ సెక్రటరీలతో కూడిన బృందానికి నిరంతరం కేసులను పర్యవేక్షించాలని సూచించారు.ముఖ్యంగా వ్యాధి లక్షణాలు కనిపించిన వెంటనే ముందస్తుగా గుర్తించడం, బాధితులకు సకాలంలో చికిత్స అందించడం.. ప్రజల్లో పరిశుభ్రత, అవగాహన పెంపొందించడం అత్యంత కీలకమని స్పష్టం చేశారు. గ్రామీణ ప్రాంతాలు, మారుమూల జిల్లాల్లో కూడా అవసరమైన ఫ్లూ నిరోధక మందుల కొరత లేకుండా చూడాలని అన్ని రాష్ట్రాల ఆరోగ్య శాఖలను కోరారు.

## ప్రముఖ నటి షావుకారు జానకి కన్నుమూత

- మొదటి పేజి తరువాయి

చెన్నైలోని బెసెంట్ నగర్ శ్మశానవాటికలో జరగనున్నట్లు కుటుంబ సభ్యు లు వెల్లడించారు. శనివారం ఉదయం నుంచి అభిమానులు, ప్రజల సందర్శనార్థం ఆమె భౌతికకాయాన్ని నివాసంలో ఉంచి, మధ్యాహ్నం అనంతరం అంతిమ సంస్కారాలను పూర్తి చేయనున్నారు.వృద్ధాప్య సంబంధిత అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆమె, చెన్నైలోని తన నివాసంలో శుక్రవారం మధ్యాహ్నం తుదిశ్వాస విడిచారు. 1931 డిసెంబర్ 12న జన్మించిన ఆమె అసలు పేరు శంకరమంచి జానకి. 'షావుకారు' చిత్రంతో వెండితెరకు పరిచయమైన ఆమెకు, ఆ సినిమా పేరే ఇంటిపేరుగా స్థిరపడిపోయింది.దాదాపు ఏడు దశాబ్దాల సుదీర్ఘ సినీ ప్రస్థానంలో తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో 400కు పైగా చిత్రాల్లో నటించి ఆమె తనదైన ముద్ర వేశారు. జానకి మృతి పట్ల చిరంజీవి, కమల్ హాసన్, జూనియర్ ఎన్టీఆర్, విష్ణు మంచు వంటి పలువురు సినీ ప్రముఖులు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. ఆమెకు ముగ్గురు సంతానం, నలుగురు మనుమలు, నలుగురు మునిమనుమలు ఉన్నారు.

పెన్ పవర్
మార్కాపురం - ప్రకాశం

# పోకూరు గ్రామంలో వీధి లైట్ల కష్టాలు

## రాత్రి వేళ మహిళల అవస్థలు




**వలేటివారిపాలెం, పెన్ పవర్ ఆగస్టు 21**

మండలంలోని పోకూరు గ్రామంలో గత కొద్ది రోజులుగా వీధి లైట్లు వెలగకపోవడంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో మహిళలు, చిన్నారులు, వృద్ధులు బయటకు రావాలంటే భయపడుతున్నారు. పాడైపోయిన లైట్లను మార్చాలని, కొత్త లైట్లు వేయాలని అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చీకటి కారణంగా పాములు, తేళ్ల భయంతో పాటు దొంగల భయం కూడా వెంటాడుతోందని అంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వీధి లైట్ల సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# గిద్దలూరు మున్సిపాలిటిపై

# ఈసారి ఎవ్వరు జెండా ఎగరేయనున్నారో?







**గిద్దలూరు పెన్ పవర్ ఆగస్టు 21**

గిద్దలూరు మున్సిపాలిటి ఎన్నికల్లో ఏపార్టీ జెండా ఎగురవేయనుందో గిద్దలూరు లో ఆసక్తికరమైన చర్చ నెలకొంది. ప్రస్తుతం గిద్దలూరు మున్సిపాలిటీలో 28 వార్డులుగా విభజించారు. ఇంతలోనే ప్రభుత్వం మున్సిపాలిటీ ఎన్నికలకు సిద్ధం కావటం తో ప్రజల్లో రాజకీయ నాయకుల్లో ఆసక్తికరమైన చర్చ మొదలైంది. గతంలో వైకాపా అధికారం లో గిద్దలూరు నగర పంచాయితిగా 20 వార్డులతో ఉండేది . ప్రస్తుతం గిద్దలూరు మున్సిపాలిటీగా రూపాంతరం చెందింది. నగర పంచాయతీ గాఉన్న సమయంలో వైకాపా అధికారం కైవసం చేసుకుంది. కానీ 2024 తెలుగుదేశం కూటమి ప్రభుత్వం రాష్టంలో అధికారం చేజిక్కించుకుంది . ఆ క్రమంలోనే గిద్దలూరు నియోజకవర్గం కూడా తెలుగుదేశము కైవసం చేసుకోగా మెజారిటీ కౌన్సిలర్లు ఒక్కసారిగా టిడిపిలోకి మారి టిడిపి తీర్థం పుచ్చుకుని పసుపు రంగులోకి మారారు. దాంతో వైకాపా బలం పూర్తిగా పడిపోయింది , అప్పటినుంచి గిద్దలూరు మున్సిపాలిటీలో అధికార కూటమి పార్టీలతో, ఎమ్మెల్యే అండతో అభివృద్ధి పరుగులు పెట్టిందనే చెప్పాలి. అయితే ప్రస్తుతం అధికారంలో టిడిపి అధికారంలో వుంది , వైకాపా హాయంలో ఎన్నికలు ఎట్లా జరిగింది అందరికి విదితమే. కానీ ఈదఫా తెలుగుదేశం మున్సిపాలిటీని ఎట్లాగైనా కైవసం చేసుకోవాలని పావులు కదుపుతున్నారు. ఇప్పటికే పట్టణంలో రాజకీయ సమీకరణలు త్వరత్వరగా మార్పులు చెందుతున్నాయి. కానీ వైకాపాలో నాయకత్వలోపం బహిరంగంగానే స్పష్టంగా కనిపిస్తోంది. స్థానిక వైకాపా నాయకులు ఎవరో ఒకరు నిత్యం వైకాపా అధినేతను కలిసి కొత్త నాయకులను పరిచయ కార్యక్రమం నిర్వహిస్తున్నారే కానీ పార్టీ కార్యకలాపాల కార్యాచరణ నామమాత్రంగానే ఉంది. పార్టీ అధిష్టానం కూడా సాచివేత ధోరణిలో ఇంకా ఏ నిర్ణయం ప్రకటించకుండా తాత్సార వైఖరితో ఉందని స్థానిక వైఎస్సార్ సీపీ శ్రేణులు మదనపడుతున్నాయి. పార్టీ అధిష్టానం మాత్రం స్థానిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యం కావాలని అందుకు యుద్ధం చేయాలని , చెప్పటంతప్ప నాయకత్వం విషయంలో నిర్ణయం ప్రకటించలేదు దీంతో వైకాపా స్థానిక నాయకులు అయోమయంలో ఉన్నారు. అంతే కాకుండా ఇటీవల అనేక కొత్త ముఖాలను తెరపైకి తెస్తున్నారు. దీంతో టిడిపిలో జోష్ పెరిగిందనే చెప్పాలి. 28 వార్డుల్లో మెజార్టీ స్థానాలను కైవసం చేసుకోవడమే ప్రధాన లక్ష్యంగా టిడిపి పార్టీ శ్రేణులు వ్యూహరచన చేస్తున్నట్లు తెలుస్తోంది. ప్రతి వార్డులో స్థానికంగా బలమైన అభ్యర్థుల ఎంపిక, కార్యకర్తల సమన్వయం, ప్రజలతో నిరంతర సంబంధాలు ఎన్నికల్లో కీలకంగా మారనున్నాయి. ఆమార్పును టిడిపి ప్రారంభించింది. గత రాజకీయ అనుభవాలను పరిగణనలోకి తీసుకుని వార్డు స్థాయిలో పార్టీ పరిస్థితిని అంచనా వేయడంతో పాటు, నాయకులు--కార్యకర్తల మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. స్థానిక ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి పురపాలక ఎన్నికల్లో విజయం సాధించే దిశగా వ్యూహ రచన ఇప్పటికే చేసుకున్నారని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. 28 వార్డుల్లో మెజార్టీ వార్డులు గెలుచుకునే లక్ష్యంతో ముందుకు సాగితేనే గిద్దలూరు నగర పంచాయతీపై ఆధిపత్యాన్ని నిలబెట్టుకునే అవకాశం ఉంటుంది.

## వాడ వాడల ఘనంగా వరలక్ష్మీ వ్రతం వేడుకలు..





**సంతమాగులూరు, (బల్లికురవ) పెన్ పవర్, ఆగస్టు 21**

వాడ వాడలా వరలక్ష్మి వ్రతం వేడుకలు ఘనంగా నిర్వహించారు. శ్రావణమాసం, శుక్లపక్షంలో, పౌర్ణమి కి ముందు వచ్చే శుక్రవారం రోజున వరలక్ష్మీ వ్రతం గా జరుపుకోవడం సనాతన హిందూ ధర్మం ఆచారం ప్రకారం కొనసాగుతోంది. మహిళలు సంప్రదాయ బద్ద అలంకరణ తో, తెలుగుతనం ఉట్టిపడేలాగా వరాలు ఇచ్చే వరలక్ష్మీ దేవిని ఈ పర్వదినం రోజున ప్రత్యేకంగా ఆరాధిస్తారు. ఈ రోజున అమ్మవారిని పూజిస్తే అష్టలక్ష్మీదేవులను పూజించిన పూజ ఫలం అందుతుందని ప్రగాఢ విశ్వాసం. అష్టైశ్వర్యాలకు ప్రతిరూపమైన సంపద, భూమి, శిక్షణ, ప్రేమ, కీర్తి, శాంతి, సంతోషం, శక్తి లభిస్తాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం. ఈ పర్వదినం రోజున రాష్ట్ర ప్రభుత్వం ఐతిక సెలవు దినంగా ప్రకటించడంతో తెలుగు లోగిళ్ళు అమ్మవారికి ఇష్టమైన పిండి వంటలతో గుమగుమలాడాయి, గ్రామదేవతలైన పోలేరమ్మ, అంకమ్మ, రేణుకమ్మ తల్లి, విగ్రహాలను వరలక్ష్మి దేవికి ప్రతిరూపంగా అలంకరించారు.

## ఇథనాల్ కర్మాగారంలో

# కుప్పకూలిన శ్లాబు...

**ఐదుగురు కార్మికులకు తీవ్ర గాయాలు.. శిథిలాల కింద మరొకరు!**
**స్థానికులకు ఉపాధిలో మొండిచేయి.. ఇతర రాష్ట్రాల కూలీల దిగుమతి**
**నాణ్యతా లోపమా.. అధికారుల నిర్లక్ష్యమా?**







**అద్దంకి, ఆర్.సి(పెన్ పవర్) ఆగస్టు 21**

కొరిశపాడు మండలం, తమ్మవరం గ్రామ పరిధిలో వందల కోట్ల రూపాయల వ్యయంతో ఇటీవల నిర్మించిన భారీ ఇథనాల్ కర్మాగారంలో శుక్రవారం ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. కర్మాగారంలో కాంక్రీట్‌తో నిర్మించిన పైభాగపు శ్లాబు అకస్మాత్తుగా కుప్పకూలింది. ఈ దుర్ఘటనలో ఉపాధి కోసం ఇతర రాష్ట్రాల నుంచి వలస వచ్చిన ఐదుగురు అమాయక కూలీలతో పాటు, స్థానికులు తీవ్రంగా గాయపడ్డారు. శ్లాబు ఒక్కసారిగా కుప్పకూలడంతో పరిసరాల్లో భారీ శబ్దం వచ్చి భయాందోళనలు రేకెత్తాయి. కాంక్రీట్ శిథిలాల కింద మరో వ్యక్తి ఇప్పటికీ చిక్కుకుని ఉన్నట్లు సమాచారం. ఆ వ్యక్తి మరణించినట్లుగానే దాదాపుగా ప్రాథమికంగా నిర్ధారించారు.

**స్థానికులకు మొండిచేయి.. నాణ్యతా లోపమే కారణమా?**

కర్మాగారం ఏర్పాటు సమయంలో స్థానికులకు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు కల్పిస్తామని యాజమాన్యం మాయమాటలు చెప్పింది. తీరా పనులు ప్రారంభమయ్యాక స్థానికులను పక్కనపెట్టి, తక్కువ ఖర్చుతో పనులు ముగించాలనే కక్కుర్తితో ఒడిశా, అసోం, తమిళనాడు రాష్ట్రాల నుంచి కార్మికులను దిగుమతి చేసుకుందనే విమర్శలు తీవ్రస్థాయిలో వినిపిస్తున్నాయి. వందల కోట్లతో చేపట్టిన ఈ భారీ నిర్మాణంలో కనీస నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడం వల్లే ఈ ఘోర ప్రమాదం జరిగిందన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

**అమాయక కూలీల ప్రాణాలతో..**

భారీ పరిశ్రమలో నాణ్యత ప్రమాణాలు పాటించి, కూలీలకు, ఉద్యోగస్తులకు అండగా నిలవాల్సిన యాజమాన్యం, ఏమాత్రం నాణ్యత ప్రమాణాలు పాటించకుండా కూలీల ప్రాణాలతో చెలగాటమాడుతున్న ఈ ఘటన.. లాభాపేక్షతో వ్యవహరించిన యాజమాన్యం నిర్లక్ష్యమా? లేక పనుల నాణ్యతను ఏమాత్రం పర్యవేక్షించకుండా గుడ్డిగా అనుమతులు మంజూరు చేసిన అధికారుల వైఫల్యమా? అన్న ప్రశ్నలు స్థానికంగా ఉత్పన్నమవుతున్నాయి. తక్షణమే క్షతగాత్రులకి మెరుగైన వైద్యం అందించడంతో పాటు, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# ఓగూరులో అనుమతులు లేకుండా చర్చి నిర్మాణం?

## దేవాదాయ భూమి ఆక్రమణపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని గ్రామస్థుల డిమాండ్



**కందుకూరు పెన్ పవర్, ఆగస్టు 21**

మండలంలోని ఓగూరు గ్రామంలో ప్రభుత్వ అనుమతులు లేకుండా చర్చి నిర్మాణం చేపట్టడంపై గ్రామస్థులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలోని సర్వే నంబర్లు 351, 352లో దేవాదాయ శాఖకు చెందిన భూమిలో కొంత భాగాన్ని ఆక్రమించి నిర్మాణ పనులు చేపడుతున్నారని ఆరోపిస్తూ ప్రకాశం జిల్లా కలెక్టర్‌కు గ్రామస్థులు వినతిపత్రం సమర్పించారు. గ్రామస్థుల వివరాల ప్రకారం.. దేవాదాయ శాఖకు చెందిన భూమిని ఆక్రమించి ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా చర్చి నిర్మాణం చేపడుతున్నారని తెలిపారు. అంతేకాకుండా నిర్మాణ పనులకు సంబంధించి సంబంధిత అధికారుల నుంచి అనుమతులు పొందలేదని పేర్కొన్నారు. ఇప్పటికే నిర్మాణ పనులు కొనసాగుతున్న నేపథ్యంలో ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను నిర్ధారించాలని వారు కోరారు. చర్చి నిర్మాణానికి ముందుగా సుమారు 100 అడుగుల దూరంలో అత్యంత పురాతనమైన శ్రీ వరదరాజస్వామి వారి దేవస్థానం ఉందని గ్రామస్థులు తమ ఫిర్యాదులో పేర్కొన్నారు. దేవస్థానానికి ఆనుకుని నిర్మాణం చేపట్టడం వల్ల భవిష్యత్తులో భక్తులకు, దేవస్థానానికి ఇబ్బందులు కలిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామంలో క్రైస్తవ మతాన్ని స్వీకరించిన వారు ఎవరూ లేరని, అయినప్పటికీ చర్చి నిర్మాణం చేపడుతున్నారని గ్రామస్థులు పేర్కొన్నారు. నిర్మాణానికి సంబంధించిన అనుమతులు, స్థల హక్కులు, భూమి స్వరూపంపై అధికారులు సమగ్రంగా పరిశీలించాలని కోరారు. దేవాదాయ భూమి ఆక్రమణ జరిగి ఉంటే సంబంధిత వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై గతంలోనే కందుకూరు సబ్‌కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించామని, దాని ప్రతులను సంబంధిత ఎండోమెంట్ అధికారులు, కమిషనర్‌కు రిజిస్టర్డ్ పోస్టు ద్వారా పంపించామని గ్రామస్థులు తెలిపారు. అయినప్పటికీ నిర్మాణ పనులు కొనసాగుతున్నందున ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి స్థలాన్ని పరిశీలించి, రికార్డులను తనిఖీ చేసి తగిన చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు. అధికారులు సమగ్ర విచారణ చేపట్టి భూమి హక్కులు, నిర్మాణ అనుమతులు, దేవాదాయ శాఖ రికార్డులను పరిశీలించిన అనంతరం వాస్తవాలను వెల్లడించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

# ప్రజా దర్బార్‌లో ప్రజల సమస్యలు విన్న ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి



**గిద్దలూరు పెన్ పవర్ ఆగస్టు 21**

గిద్దలూరులో శుక్రవారం నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల సమస్యలను ఎమ్మెల్యే స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రజలతో ఆప్యాయంగా మాట్లాడిన ఎమ్మెల్యే అశోక్ రెడ్డి, వారి సమస్యలను సానుకూలంగా విని, పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. సమస్యల పరిష్కారంలో సంబంధిత అధికారులతో మాట్లాడి అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రజా దర్బార్‌కు వచ్చిన ప్రతి ఒక్కరితో మమేకమై, వారి ఇబ్బందులను తెలుసుకుంటూ భరోసా కల్పించడం పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని పరిష్కరించేందుకు ప్రజా దర్బార్ కార్యక్రమం కొనసాగుతుందని ఎమ్మెల్యే తెలిపారు.

# వైభవంగా సామూహిక వరలక్ష్మీ వ్రతం





**కందుకూరు పెన్ పవర్,ఆగస్టు 21**

వరలక్ష్మి వ్రతం సందర్భంగా కందుకూరు పెద్ద బజారు నందు ఉన్న శ్రీ కోదండ రామాలయంలో వేంచేసి ఉన్న శ్రీ లక్ష్మీ దేవి అమ్మవారి ఆలయంలో శుక్రవారం సామూహిక వరలక్ష్మీ వ్రతాలు ఎంతో వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు శ్రీ లక్ష్మీ అమ్మవారికి అభిషేకం నిర్వహించి, చందన అలంకారంతో అమ్మవారిని కన్నులు పండుగగా అలంకరించారు. అమ్మవారి అలంకారం భక్తులకు కనువిందు చేసింది. మద్దాళి సుబ్రహ్మణ్యం కుటుంబ సభ్యులు ఉభయ దాతలుగా వ్యవహరించారు. సామూహిక వరలక్ష్మీ వ్రతాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ వరలక్ష్మీ వ్రతం కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో మహిళా భక్తులు పాల్గొని వరలక్ష్మి వ్రతాన్ని ఆచరించారు. అనంతరం విచ్చేసిన భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రెసిడెంట్ మురారిశెట్టి వెంకట సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి మురారిశెట్టి శ్రీనివాసులు, ఆలయ కమిటీ సభ్యులు భక్తులు పాల్గొన్నారు.

# గిద్దలూరు మున్సిపాలిటీలో 28 వార్డుల విభజన

### మున్సిపల్ కమిషనర్ బి వి రమణ బాబు

**గిద్దలూరు పెన్ పవర్ ఆగస్టు 21**



గిద్దలూరు మున్సిపాలిటీ ని వార్డుల పునర్విభజన లో భాగంగా 28 వార్డులుగా విభజిస్తూ పంపిన ప్రతిపాదనలకు ప్రభుత్వం ఆమోదం లభించిందని మున్సిపల్ కమిషనర్ ఈ వి రమణ బాబు తెలిపారు. పురపాలక పరిపాలన ,పట్టణ అభి వృద్ధి శాఖ జారీ చేసిన ఉత్తర్వులు మేరకు గిద్దలూరు పురపాలక సం ఘంలో ఎన్నికల వార్డుల పునర్విభజన ప్రక్రియ చేపట్టడం జరిగిందని ఆయన తెలిపారు. ఆ మేరకు గిద్దలూరు పురపాలక సంఘాన్ని 28 వార్డులు గా విభజిస్తూ రూపొందించిన ముసాయిదా నోటిఫికేషన్ ను నోటీస్ బోర్డు పురపాలక పరిధి లో ని ప్రముఖ ప్రదేశాల లో ప్రదర్శించి ప్రజల నుండి అభ్యంతరాలు సలహాలు సూచనలు స్వీకరించామన్నారు. ఆ అభ్యంతరాల ను ,సలహాలు పరిశీలించి గిద్దలూరు పురపాలక సంఘం ప్రత్యేక అధికారి కి పంపగా ఈ ఏడాది మే 25 న జరిగిన సమావేశంలో ప్రేత్యేక అధికారి ఈ ప్రతిపాదన కు ఆమోదం తెలిపి మార్కాపురం జిల్లా కలెక్టర్ ద్వారా ప్రభుత్వ ఆమోదానికి సమర్పించాలని తీర్మానించటం జరిగిందన్నారు. జిల్లా కలెక్టర్ ఆ ప్రతిపాదన ను ఆమోదిస్తూ గిద్దలూరు పురపాలక సంఘాన్ని 28 వార్డు లు గా విభజిస్తూ ఆదేశాలు జారీ చేశారని తెలిపారు.

# ఘనంగా వరలక్ష్మి వ్రత పూజలు – మహిళల భక్తి శ్రద్ధలు

**పీసీపల్లి, పెన్ పవర్ ఆగస్టు 21**

మండల వ్యాప్తంగా పలు గ్రామాల్లో శుక్రవారం వరలక్ష్మి వ్రత వేడుకలు అత్యంత భక్తి శ్రద్ధలతో, వైభవంగా జరిగాయి. మండలంలోని ఇర్లపాడు , పెద్ద చెర్లోపల్లి వెంగళాపురం, అలవలపాడు తదితర గ్రామాల్లో మహిళలు ఇళ్లలో అమ్మవారిని కొలుస్తూ పూజలు నిర్వహించారు. శ్రావణ మాసంలో రెండవ శుక్రవారం సందర్భంగా మహిళలు తెల్లవారుజామునే లేచి ఇళ్లను శుభ్రం చేసుకుని, ముగ్గులు వేసి, మామిడి తోరణాలతో అలంకరించారు. వరలక్ష్మి దేవి ప్రతిమను ఏర్పాటు చేసి పసుపు, కుంకుమ, పూలు, పండ్లు, నైవేద్యాలతో ఘనంగా పూజించారు. తమ భర్తలు, పిల్లలు ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో, అష్టైశ్వర్యాలతో ఉండాలని మహిళలు అమ్మవారిని వేడుకున్నారు. పలువురు మహిళలు సమూహంగా ఒకచోట చేరి వరలక్ష్మి వ్రత కథను చదివి వినిపించారు. అనంతరం ఒకరికొకరు వాయినాలు, తాంబూలాలు ఇచ్చిపుచ్చుకుని శుభాకాంక్షలు తెలిపారు. గ్రామాల్లోని లక్ష్మీ ఆలయాల్లో కూడా ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు నిర్వహించారు. వ్రతం సందర్భంగా గ్రామాలన్నీ పండగ వాతావరణాన్ని సంతరించుకున్నాయి.

# టిడిపి నాయకులు వయ్యకంటి హుక్కు ఆధ్వర్యంలో రెండేళ్ల నమ్మకం

## రహదారుల అభివృద్ధి ప్రజాసేవే లక్ష్యంగా -సొంత నిధులతో మూడు మట్టితో నిర్మించిన రహదారులు

## కూటమి ప్రభుత్వ లక్ష్యాన్ని మంత్రి గొట్టిపాటి అడుగుజాడల్లో నడుస్తూ..

**సంతమాగులూరు, పెన్ పవర్, ఆగస్టు 21**

సంతమాగులూరు మండలం కొమ్మాలపాడు గ్రామంలో శుక్రవారం రెండేళ్ల నమ్మకం కార్యక్రమం వయ్యకంటి ఉక్కు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రజల నుంచి విశేషమైన స్పందన రావడం ఆనందకరంగా ఉందని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా వయ్యకంటి హుక్కు మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సూపర్ సిక్స్ లో భాగంగా ప్రజాధనాన్ని వృథా కాకుండా ప్రజల వద్దకు సంక్షేమం చేర్చడమే తన కర్తవ్యంగా చేస్తామని చెప్పారు. మంత్రివర్యులు గొట్టిపాటి రవికుమార్ అడుగుజాడల్లో ప్రజాసేవే తనకు ముఖ్య లక్ష్యంమని ప్రజా సమస్యలను పరిశీలించడమే తన ఉద్దేశమని, కొమ్మాలపాడు గ్రామాన్ని అభివృద్ధి బాటలో నడిపించేందుకు తన సాయశక్తుల కృషి చేస్తానని, ఏటువంటి రాజకీయ అపోహలకు తావివ్వని ఆయన తెలిపారు. ప్రజలతో మమేకమై అందరి సమస్యలను తెలుసుకుంటూ వారి సమస్యలు అధికారులు దృష్టికి తీసుకు వెళ్లే విధంగా కృషి చేస్తానని ఆయన తెలిపారు. అంతేకాకుండా కుల మత భేదలకు తావు ఇవ్వకుండా అందరికీ సమాన హక్కులు ఉండాలని ఆయన తెలిపారు. కొద్ది రోజుల క్రితం హిందువుల స్మశాన వాటికకు వెళ్లే డొంక రహదారికి వర్షం పడితే వెళ్ళలేని పరిస్థితి ఉన్నందున ఆయన సొంత నిధులు 50000/- రూపాయలతో ఆ రహదారి సమస్యను పరిష్కారం చేయించడం జరిగిందని ఆయన తెలిపారు. ఇవే కాకుండా మాగులూరు డొంక రహదారి సుమారు 350000/- రూపాయల వ్యయంతో తన సొంత నిధులతో వేయించడం జరిగిందని. తన సొంత నిధులతో అభివృద్ధి కార్యక్రమాలు



చేయడం తాను ఒక బాధ్యతగా తీసుకున్నానని ఆయన తెలిపారు.

**వయ్యకంటి ఉక్కు గురించి ప్రజలలో విశేష స్పందన**

కొమ్మలపాడులో చేస్తున్న పలు అభివృద్ధి పనులు గ్రామ కార్యక్రమాలలో వయ్యకంటి హుక్కు ఎంతో కృషి చేస్తున్నారని, ప్రజా సమస్యలపై నిత్యం పోరాడుతున్నారని ఆయన చేస్తున్న సేవలు స్థానిక ప్రజానీకానికి ఎంతో శ్రేయస్కరంగా ఉన్నాయని స్థానికులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వయ్యకంటి మస్తాన్ వలి హుక్కు, మండల తెలుగు యువత ఉపాధ్యక్షులు వయ్యకంటి దరియవలి, నాయబ్ ఫజల్, కాలేషాగారి బాజీ, షేక్ మహబూబ్ బాషా, వయ్యకంటి భాష,



నాయకులు, కార్యకర్తలు, పలువురు పాల్గొన్నారు.

# ప్రభుత్వ కక్షసాధింపు చర్యలను, వైఫల్యాలను తీవ్రంగా ఖండిస్తున్నాం -వైఎస్సార్‌సీపీ ఇంచార్జ్ దద్దాల

**సి ఎస్ పురం, పెన్ పవర్ ఆగస్టు 21**



రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని,ప్రజల దృష్టిని మళ్లించడానికి, నిత్యం ప్రతిపక్షంపై కక్షసాధింపు చర్యలకే పరిమితమైందని కనిగిరి నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ ఇంచార్జ్ దద్దాల నారాయణ యాదవ్ ధ్వజమెత్తారు శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయం నుండి ఒక ప్రకటన లో దద్దాల నారాయణ యాదవ్ మాట్లాడుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి శ్రీ వైయస్ జగన్ మోహన్ రెడ్డి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కు వారి తనయుడు విద్యా శాఖ మంత్రి లోకేష్ కు విసిరిన సవాల్ స్వీకరించి వాటిపై సమాధానం చెప్పగలరా అని ఆయన అన్నారు. వైఎస్ జగన్ లేవనెత్తిన ప్రజా సమస్యలపై ప్రభుత్వం సమాధానం చెప్పలేక, అసెంబ్లీలో ప్రధాన ప్రతిపక్ష హోదా ఇవ్వకుండా విపక్షం గొంతు నొక్కాలని చూస్తోందన్నారు.

**డీఎస్సీ, గ్రూప్-1 నియామకాలపై డ్రామాలు**

డీఎస్సీ ప్రక్రియలో జరిగిన అక్రమాలను కప్పిపుచ్చుకోవడానికి, తన కుటుంబ సభ్యులను కాపాడుకోవడానికి ప్రభుత్వం కుట్ర పన్నుతోందని, ఏపీపీఎస్సీ గ్రూప్-1 పోస్టుల భర్తీపై తప్పుడు ఆరోపణలు చేస్తూ అసలు సమస్యను పక్కదారి పట్టిస్తున్నారన్నారు. గ్రూప్-1 నియామకాలపై సీబీఐ విచారణకు మేం పూర్తిగా సిద్ధం... మరి మీ డీఎస్సీ అక్రమాలపై సీబీఐ విచారణకు ప్రభుత్వం సిద్ధమా? అని ప్రశ్నించారు.

**ఉపాధ్యాయుల వేధింపులు దారుణం**

ఇన్-సర్వీస్ టీచర్లకు టెట్ నిర్వహించాలన్న అనాలోచిత నిర్ణయాన్ని ప్రశ్నిస్తూ, న్యాయమైన సమస్యను కేంద్రం దృష్టికి తీసుకెళ్లడానికి ప్రయత్నించిన ఐదుగురు ప్రభుత్వ ఉపాధ్యాయులను సస్పెండ్ చేయడం అత్యంత దుర్మార్గమని, ఉపాధ్యా యుల పొట్ట కొట్టే ఈ చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.తక్షణమే వారి సస్పె న్షన్‌ను ఎత్తివేయాలని డిమాండ్ చేస్తున్నామని లేదంటే ఉపాధ్యాయ లోకానికి అండగా వైఎస్సార్‌సీపీ తీవ్రస్థాయిలో పోరాటం చేస్తుందని హెచ్చరించారు.

**ప్రతిపక్ష హోదాపై భయం**

ప్రజాస్వామ్యంలో ప్రజల తరఫున గట్టిగా నిలదీస్తున్న ఏకైక ప్రధాన ప్రతిపక్షం వైఎస్సార్‌సీపీనే,శాసనసభలో మా గొంతును చూసి భయపడే ప్రభుత్వాలు మాకు ప్రతిపక్ష హోదా ఇవ్వకుండా ప్రజాస్వామ్య విలువలను అపహాస్యం చేస్తున్నాయని దుయ్యబట్టారు.ప్రజలు ఈ ప్రజా వ్యతిరేక విధానాలను గమనిస్తున్నారని కాలం చెల్లిన రాజకీయాలతో మభ్యపెట్టాలని చూస్తే రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర నిరసనలు ఎదుర్కోవాల్సి వస్తుందని ఈ సందర్భంగా దద్దాల నారాయణ యాదవ్ కూటమి ప్రభుత్వాన్ని హెచ్చరిస్తున్నామని వెల్లడించారు.

# మాజీ సీఎం వైయస్ జగన్మోహన్ రెడ్డిని కలిసిన పిడతల ప్రవీణ్ కుమార్ రెడ్డి



**గిద్దలూరు పెన్ పవర్ ఆగస్టు 21**

మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి ని గిద్దలూరు వైసిపి నాయకులు ఏపీ స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్ ఎర్రగొండపాలెం పరిశీలకులు పిడతల ప్రవీణ్ కుమార్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో జగన్మోహన్ రెడ్డి ని కలిశారు. ఈ సందర్భంగా పలు అంశాలపై మాట్లాడిన మాజీ సీఎం జగన్ .. స్థానిక ఎన్నికలు వస్తున్న నేపథ్యంలో సంసిద్ధంగా ఉండి వాటిని బలోపేతం చేస్తూ ముందుకు వెళ్లాలని అన్నారు. అలానే ఎర్రగొండపాలెం లో ప్రవీణ్ కుమార్ రెడ్డి నిర్వహిస్తున్న బాధ్యతలను ప్రశంసించారు. అక్కడ ఎటువంటి సమస్యలు లేకుండా పార్టీని ముందుకు తీసుకువెళ్లాలన్నారు. కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ కార్యకర్తల సమస్యలపై దృష్టి పెట్టాలన్నారు.

# పువ్వాడి వెంకటేశ్వర్లును పరామర్శించిన.. మాజీ ఎమ్మెల్యే కదిరి

**సి ఎస్ పురం, పెన్ పవర్ ఆగస్టు 21**

పామూరు మండలం టిడిపి మాజీ మండల పార్టీ అధ్యక్షులు పువ్వాడి వెంకటేశ్వర్లు ఇటీవల గుండె సంభంధిత శస్త్ర చికిత్స చేయించుకొని విశ్రాంతి తీసుకుంటున్నారు. విషయం తెలుసుకున్న కనిగిరి మాజీ ఎమ్మెల్యే ,విశాఖపట్నం పార్లమెంట్ వైసీపీ పరిశీలకులు కదిరి బాబురావు పామూరు లోని వెంకటేశ్వర్లు నివాసగృహానికి వెళ్లి పరామర్శించి ఆరోగ్య పరిస్థితులు అడిగితెలుసుకున్నారు.ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించి విశ్రాంతి తీసుకోవాలని సూచించారు.



# నేడు కొమరోలు పట్టణంలోని 14 వీధులకు విద్యుత్ సరఫరా నిలిపివేత

## తాతిరెడ్డి పల్లి ఫీడర్ లోని నాలుగు గ్రామాలకు కూడా సరఫరా నిలిపివేత

**కొమరోలు పెన్ పవర్ ఆగస్టు 21**



కొమరోలు పట్టణంలోని 14 వీధులతోపాటు తాతిరెడ్డిపల్లె ఫీడర్ లోని నాలుగు గ్రామాలకు ఈనెల 22వ తేదీ శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లుగా నిలిపివేయనున్నట్లుగా కొమరోలు విద్యుత్ శాఖ ఏఈ ఎం శ్రీనివాసులు తెలిపారు. ఆర్ డి ఎస్ ఎస్ పథకం ద్వారా కొత్త లైన్ల ఏర్పాట్ల లోభాగంగా ఈనెల 22వ తేదీ శనివారం కొమరోలు పట్టణంలోని పలు వీధులలో కొత్త లైన్లు ఏర్పాటు చేయుటకు చర్యలు తీసుకున్నామని ఆయన తెలిపారు. ఆ కారణంగా కొమరోలు పట్టణంలోని పురుషోత్తముని పల్లికి వెళ్లే రోడ్డు, ఇండేన్ గ్యాస్ కార్యాలయం మెయిన్ రోడ్డు, ఆరె మరాఠీ కాలనీ, శివాజీ నగర్, ఇస్లాంపేట, స్టేట్ బ్యాంకు రోడ్డు,బ్రాహ్మణ బజారు,సినిమా హాల్ కి వెళ్లే రోడ్ల వీధులు,తాసిల్దార్ కార్యాలయం రోడ్డు లోని వీధులతో పాటు, తాతిరెడ్డిపల్లి ఫీడర్ లోని తాతిరెడ్డి పల్లె, పురుషోత్తమపల్లె, సరివి రెడ్డి పల్లె, కే బొంతపల్లి గ్రామాలకు ఈనెల 22 తేదీ శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లుగా ఆయన చెప్పారు.కాగా కొమరోలు పట్టణంలోని బొరుగుల బట్టి కి వెళ్లే రోడ్డు, పోలీస్ స్టేషన్ రోడ్డు,ఆర్టీసీ బస్టాండ్ ఏరియా, షిరిడి సాయిబాబా గుడి ఏరియా, తో పాటు గోపాని పల్లి గ్రామానికి ఈనెల 22వ తేదీ శనివారం మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లుగా ఆయన వివరించారు కావున విద్యుత్ వినియోగదారులు విద్యుత్ శాఖకు సహకరించాలని శ్రీనివాసులు కోరారు.

# సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఘనంగా వరలక్ష్మీ వ్రతం

## సనాతనధర్మ పరిరక్షణకు కృషి చేయాలి -ఎం. అచ్యుతరావు

**సి.ఎస్.పురం, పెన్ పవర్ ఆగస్టు 21**

సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో అగ్రహారం గ్రామంలోని రామాలయం వద్ద శుక్రవారం వరలక్ష్మీ వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని వేద మంత్రోచ్చారణలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు ఈ కార్యక్రమమునకు ముఖ్యఅతిథిగా సమరసత సేవా ఫౌండేషన్ మండల మహిళా కన్వీనర్ కె. పద్మావతి పాల్గొని మాట్లాడుతూ శ్రావణమాసం ఆధ్యాత్మికంగా ఎంతో విశిష్టమైన మాసమని, ఈ మాసంలో నిర్వహించే వరలక్ష్మీ వ్రతానికి మహిళల జీవితాల్లో ప్రత్యేక ప్రాధాన్యత ఉందన్నారు. కుటుంబ సుఖసంతోషాలు, ఆరోగ్యం, ఐశ్వర్యం కోసం మహిళలు భక్తిశ్రద్ధలతో అమ్మవారిని ఆరాధించడం ఆనవాయితీగా వస్తోందని తెలిపారు.

**సనాతన ధర్మ పరిరక్షణకు కృషి చేయాలి..:** ఈ సందర్భంగా ఖండ




ధర్మ ప్రసారక్ ఎం. అచ్యుతరావు మాట్లాడుతూ వరలక్ష్మీ వ్రతం కేవలం ఒక పూజా కార్యక్రమం మాత్రమే కాదని, కుటుంబ వ్యవస్థను, ధార్మిక సంప్రదాయాలను బలోపేతం చేసే ఆధ్యాత్మిక కార్యక్రమమని అన్నారు. శ్రావణమాసంలో వరలక్ష్మీ వ్రతాన్ని ఆచరించడం ద్వారా లక్ష్మీదేవి అనుగ్రహం లభిస్తుందని భక్తుల విశ్వాసమన్నారు.మన పూర్వీకులు ఆచరించిన పూజా విధానాలు, వ్రతాలు, హోమాలకు ఎంతో ప్రాధాన్యత ఉందని, వాటి వెనుక ఉన్న ఆధ్యాత్మిక భావనలను నేటి తరానికి తెలియజేయవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు హోమాలు నిర్వహించడం ద్వారా వాతావరణంలో పవిత్రత నెలకొనడంతోపాటు భక్తుల్లో ఏకాగ్రత ఆధ్యాత్మిక భావన పెంపొందుతుందన్నారు గ్రామాల్లోని ఆలయాలలో ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం వల్ల ప్రజల మధ్య ఐక్యత సోదరా భావం పెరుగుతుందన్నారు మహిళలు యువత, భక్తులు ఇలాంటి కార్యక్రమాల్లో పాల్గొని సనాతన ధర్మ సంప్రదాయాలను పరిరక్షించాలని పిలుపునిచ్చారు భావితరాలకు మన సంస్కృతి గొప్పతనాన్ని తెలియజేశాలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు ఈ కార్యక్రమంలో మండల సహా కన్వీనర్ కె కొండయ్య, గ్రామ ధార్మిక సమితి సభ్యులు, గ్రామస్తులు, మహిళలు భక్తులు పాల్గొన్నారు.

# చింతలపల్లి గ్రామంలో ఇంటింటికి తెలుగుదేశం పార్టీ కార్యక్రమం నిర్వహించిన బోనేని వెంకటేశ్వర్లు యాదవ్

**కార్యక్రమంలో పాల్గొన్న చింతల పల్లె పంచాయతీ తెలుగుదేశం పార్టీ నేతలు కార్యకర్తలు.**

**కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించిన బోనేని.**





**కొమరోలు పెన్ పవర్ ఆగస్టు 21**

కొమరోలు మండలం చింతలపల్లి గ్రామంలో శుక్రవారం మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు బోనేని వెంకటేశ్వర్లు యాదవ్ ఆధ్వర్యంలో ఆ పార్టీ నేతలు కార్యకర్తలు ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమం ముమ్మరంగా నిర్వహించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాలతో గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి సూచనల మేరకు గత నెల రోజులుగా మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు బోనేని వెంకటేశ్వర్లు యాదవ్ మండలంలోని పలు గ్రామాలలో ఇంటింటికి తెలుగుదేశం పార్టీ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఆ సందర్భంగా ఆయన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తున్నారు.అందులో భాగంగా శుక్రవారం కొమరోలు మండలం చింతలపల్లి గ్రామంలో ఆ పంచాయతీ తెలుగుదేశం పార్టీ నాయకులు సారే ఎల్లాల నాయుడు అధ్యక్షతన ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమం చేపట్టగా, ఆ కార్యక్రమానికి మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు బోనేని వెంకటేశ్వర్లు యాదవ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆ సందర్భంగా బోనేనీ వెంకటేశ్వర్లు యాదవ్, ఎల్లాల నాయుడు తదితర నేతలు కార్యకర్తలు ఆ గ్రామంలో ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వ ముద్రించిన కరపత్రాలను పంచిపెడుతూ, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి,సంక్షేమ పథకాలతో పాటు మౌలిక వసతులు, యువతకు ఉపాధి అవకాశాలు,రైతు సంక్షేమం, మహిళాభ్యుదయం,ఉచిత గ్యాస్ సిలిండర్లు, ఉచిత బస్సు సౌకర్యం,విద్యా వైద్య సౌకర్యాల మెరుగుదల, గ్రామీణ అభివృద్ధి తదితర అభివృద్ధి సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. ఆ మేరకు ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వానికి తమ సంపూర్ణ సహాయ సహకారాలు ఉంటాయని తెలిపారు. ఆ కార్యక్రమంలో మండల క్లస్టర్ ఇంచార్జి స్పందన పోయిన భూపాల్, చింతలపల్లి పంచాయతీ టీడీపీ నాయకులు కొండయ్య, ఊస రాముడు, తదితర కార్యకర్తలు పాల్గొన్నారు. చింతలపల్లి గ్రామానికి వచ్చిన భోనేని వెంకటేశ్వర్లు యాదవ్ ను ఎల్లాలు నాయుడు ఆధ్వర్యంలో శాలువా పూలమాలతో ఘనంగా సన్మానించారు.

## చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం



**పొన్నలూరు పెన్ పవర్ ఆగస్టు 21**

స్థానిక ఎన్టీఆర్ విగ్రహం సమీపంలో శుక్రవారం బీసీలకు 34% రిజర్వేషన్ కల్పించినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. మండల టిడిపి ప్రధాన కార్యదర్శి మోర బోయిన మాల్యాద్రి మాట్లాడుతూ బీసీలకు రాజకీయంగా మరింత అవకాశాలు కల్పించాలని లక్ష్యంతో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మకమని తెలిపారు. 34 శాతం రిజర్వేషన్ తో స్థానిక సంస్థల్లో పాతినిధ్యం మరింత పెరుగుతుందని అన్నారు. కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం పై బీసీలు కృతజ్ఞత తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ రామాంజనేయులు, గట్టెబోయిన మల్లికార్జునరావు, ఆదయ్య, తాడి బోయిన రమణయ్య, రమణయ్య, నరాల గంగయ్య, మండల టిడిపి నాయకులు కర్ణ కోటిరెడ్డి, మండవ ప్రసాద్, మండవ మురళీమోహన్ తదితరులు పాల్గొన్నారు.

## పామూరులో మీసాల వారి గాంధీ హాస్పిటల్ ప్రారంభం



**కనిగిరి ఆర్సీ ఇంచార్జ్ పెన్ పవర్, ఆగస్టు 21**

పామూరు పట్టణంలో గురువారం మీసాల వారి నూతన గృహప్రవేశం మరియు నూతనంగా ఏర్పాటు చేసిన మీసాల వారి గాంధీ హాస్పిటల్ ప్రారంభోత్సవ వేడుకలు ఘనంగా, వైభవంగా జరిగాయి. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ ఏపీ మెడికల్ కౌన్సిల్ మెంబర్, ప్రముఖ వైద్యులు డాక్టర్ పెరుగు మురళీకృష్ణ యాదవ్ మరియు వారి సతీమణి డాక్టర్ యన్నబత్తిన హరిత దంపతులు హాజరయ్యారు. వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ గృహప్రవేశ పూజలు, అనంతరం హాస్పిటల్ ప్రారంభోత్సవం జరిగింది. హాస్పిటల్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన రిబ్బన్ ను కట్ చేసి డాక్టర్ దంపతులు ప్రారంభించారు. అనంతరం డాక్టర్ పెరుగు మురళీకృష్ణ యాదవ్ మాట్లాడుతూ పామూరు వంటి ప్రాంతంలో ఆధునిక హంగులు, అత్యాధునిక వైద్య పరికరాలతో ఇలాంటి హాస్పిటల్ ఏర్పాటు చేయడం చాలా అభినందనీయమని అన్నారు. పేద, మధ్యతరగతి ప్రజలకు అందుబాటు ధరల్లో నాణ్యమైన వైద్య సేవలు అందించి, ప్రజల ఆరోగ్య సంరక్షణలో ఈ హాస్పిటల్ ముందుండాలని ఆకాంక్షించారు. మీసాల వారి కుటుంబానికి నూతన గృహప్రవేశ శుభాకాంక్షలు, హాస్పిటల్ యాజమాన్యానికి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు, వైద్యులు, మీసాల వారి కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, పట్టణ ప్రముఖులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## హిందూ ధర్మ పరిషత్ ఆధ్వర్యంలో వరలక్ష్మీ వ్రతం



**సంతమాగులూరు, (బల్లికురవ) పెన్ పవర్, ఆగస్టు 21**

బల్లికురవ మండలంలోని కొత్తూరు గ్రామంలో తిరుమల తిరుపతి దేవస్థానము హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో శుక్రవారం వరలక్ష్మీ వ్రతం ఘనంగా నిర్వహించారు. శ్రీ సీతారామచంద్ర స్వామి వారి దేవస్థానం వద్ద వరలక్ష్మి వ్రత కార్యక్రమం కొనసాగింది . 110 మంది మహిళలు వ్రత పూజలో పాల్గొన్నారు. మహిళలకు పద్మావతి అమ్మవారి రూపులు, కంకణాలు, పుస్తక ప్రసాదం అందజేశారు . సమన్వయకర్త చెన్నుపల్లి నాగేశ్వరరావు ప్రత్యేక అధికారి రావినూతల రామకృష్ణ ,ధర్మాచార్యులు మాదాల దానయ్య, పెద్ది శెట్టి వెంకటాద్రి, స్థానిక దేవాలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# నేను ఉన్నాను.. నేను వస్తున్నాను..!


**అన్నా.. మీ ఆశీస్సులు కావాలి.. పార్టీ కోసం పని చేస్తా..!**

**మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్ కలిసిన పారిశ్రామికవేత్త అంబటి భూపాల్ రెడ్డి.**

**వైసిపి పార్టీ కోసం పని చేస్తే ప్రతి ఒక్కరికి న్యాయం చేస్తాం జగన్ భరోసా.**

**కార్యకర్తలకు అండగా ఉండండి -మీ సేవలను ప్రజలకు ఉపయోగించండి.**






**పెన్ పవర్ కంభం ఆగస్టు 21**

కార్యకర్తల సమస్యలను ప్రజల సమస్యలను గుర్తించిన వారికి అండగా ఉన్నప్పుడే మంచి గుర్తింపు ఉంటుందని మాజీ ముఖ్యమంత్రి వైఎస్. జగన్మోహన్ రెడ్డి కొంతమంది కీలకమైన నాయకులు కార్యకర్తలు అభిమానులు కలిసినప్పుడు కొంత స్పష్టత ఇచ్చినట్లు తెలిసింది. ఇటీవల రాజకీయ రంగ ప్రవేశం చేసిన పార్టీలో చురుకుగా పాల్గొంటున్న పారిశ్రామికవేత్త అంబటి భూపాల్ రెడ్డి, ఇతర అభిమానులను కార్యకర్తలను ఉద్దేశించి కొన్ని సూచనలు చేసినట్లు తెలిసింది. పార్టీ కోసం పనిచేసే వారిని వదులుకో ము. వారికి తగిన ప్రాధాన్యత ఉంటుంది. అలాగే ముందుకు సాగు ఎన్ని కష్టాలు వచ్చినా పార్టీ కోసం పని చేయాలని హితవు పలికినట్లు తెలిసింది. కాగా వైయస్ జగన్ కలిసిన వారిలో కొంతమంది నాయకులు తమకు జరుగుతున్న అన్యాయాల గురించి వివరించినట్లు తెలిపారు. సరైన సమయంలో ప్రతి ఒక్కరికి మంచి గుర్తింపు ఉంటుందని వారికి భరోసా ఇచ్చినట్లు సమాచారం. గత నెల రోజులుగా అంబటి భూపాల్ రెడ్డి కార్యకర్తలతో అందుబాటులో ఉంటూ వారి ఆశీస్సులు పొందుతుండడం గమనించాలి. ఒక అడుగు ముందుకేసి దానధర్మాలు చేస్తుండడంతో అనతి కాలంలోనే కొంత గుర్తింపు పొందాడు. కాగా మున్సిపల్ ఎన్నికలు పంచాయతీ మండల పరిషత్ ఎన్నికలు సమీపిస్తున్న వేళ మంచి బలమైన నాయకుడు ఉండాలని అభిమానులు కూడా ఆశిస్తున్నారు. వైసీపీ పార్టీ అంబటికీ ఎలాంటి ఆశీస్సులు అందిస్తుందో చూద్దామని అభిమానులు కార్యకర్తలు ఎదురుచూస్తున్నారు.

# వైభవంగా వరలక్ష్మీ వ్రత పూజలు

**సంతమాగులూరు, పెన్ పవర్, ఆగస్టు 21**

సంతమాగులూరు మండల వ్యాప్తంగా శ్రావణ మాసంలోని రెండో శుక్రవారం భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రత పూజలు నిర్వహించారు. సుమంగళులు ఉదయం నుంచే తలస్నానం చేసి, నూతన వస్త్రాలు ధరించి, లక్ష్మీదేవిని పూజించారు. ఇంటింటా మండపాలు ఏర్పాటు చేసి పసుపు, కుంకుమ, పూలతో అమ్మవారిని అలంకరించారు. వ్రత కథను విని, తోరణాలు కట్టుకున్నారు. కుటుంబ సభ్యుల సుఖసంతోషాలు, సౌభాగ్యం కోసం మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. దేవాలయాల్లోనూ ప్రత్యేక పూజలు, అర్చనలు జరిగాయి. ఏల్చూరులోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఆర్యవైశ్య కుటుంబ సభ్యులు పూజల్లో పాల్గొన్నారు. అర్చకులు డాక్టర్ వినుకొండ సత్యవరప్రసాద్ ఆధ్వర్యంలో వాసవిమాతకు వెండి ఆభరణాలతో సుందరంగా అలంకరించారు. వ్రతం ముగింపులో సుమంగళులు ఒకరికొకరు పసుపు, కుంకుమ, గాజులు ఇచ్చిపుచ్చుకున్నారు. ఇంటికి వచ్చిన ముత్తైదువులకు భోజనాలు పెట్టి సత్కరించారు. గ్రామాల్లో అంతా పండుగ వాతావరణం నెలకొంది.



# ఆనంద ఆశ్రమంలో ఘనంగా సామూహిక వరలక్ష్మీ వ్రతం



**దొనకొండ ఆగస్టు 21 పెన్ పవర్**

మండల కేంద్రంలో నీ విరాట్ నగర్ లో గల శ్రీ ఆనంద ఆశ్రమంలో శ్రావణమాసం రెండవ శుక్రవారం పురస్కరించుకొని దొనకొండ శ్రీ ఆనంద ఆశ్రమంలో శ్రీ గోవిందమాంబ శ్రీ వరలక్ష్మి దేవిగ దర్శనం ఇచ్చారు పురోహితులు పవన్ కుమార్ శర్మ ఉదయం 10:00 నుండి అమ్మవారికి పంచామృతాలతో అభిషేకాలు ప్రత్యేక అలంకరణలు చేసి మహాన్యాస పూర్వక గణపతి పూజ శ్రీ వరలక్ష్మి అష్టోత్తర కుంకుమ పూజలు లలిత సహస్ర నా మార్చనలు శ్రీ వరలక్ష్మి వ్రత కథలు తెలియజేశారు తదనంతరం మహా నైవేద్యం సమర్పించి పంచ హారతులు మహిళలచే సామూహిక హారతులు ఇచ్చి ఒకరికొకరు వాయినాలు ఇచిపుచ్చుకున్నారు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు వచ్చిన శ్రీ భైరవానంద స్వామి వచ్చిన భక్తులకు తీర్థప్రసాదాలు అన్నదానం నిర్వహించారు.


## గ్రామదేవతల ఆలయాల పునర్నిర్మాణానికి శ్రీకారం



**సంతమాగులూరు,(బల్లికురవ) పెన్ పవర్, ఆగస్టు 21**

బల్లికురవ మండలంలోని కూకట్లపల్లి గ్రామంలో గ్రామ దేవతలైన పోలేరమ్మ తల్లి ,అంకమ్మ తల్లి ఆలయాల పునర్నిర్మాణానికి శుక్రవారం శ్రీకారం చుట్టారు. కోటి రూపాయల అంచనా వ్యయంతో నిర్మించేందుకు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఎంపికతో పాటు, ఎకరాకు 5000 చొప్పున ఆలయ నిర్మాణ చందాను వసూలు చేయడం ద్వారా ఆలయాన్ని పూర్తి చేయనున్నారు. బాలాలయాన్ని ఏర్పాటు చేసి , పాత ఆలయాల్లోని విగ్రహాలు తీసే పనులు బద్వేల్ కు చెందిన ప్రతిష్టాచార్యులు శివ స్వామి బృందం, ఆధ్వర్యంలో కొనసాగుతున్నాయి. మూడు రోజులపాటు ఈ వేడుకలు కొనసాగిన అనంతరం ఆదివారం అన్నసంతర్పణ నిర్వహించనున్నట్లు ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు తెలియజేశారు.

## ఘనంగా ప్రసన్నాంజనేయుని వార్షికోత్సవం



**సంతమాగులూరు,(బల్లికురవ) పెన్ పవర్ ఆగస్టు 21**

బల్లికురవ మండలంలోని కొత్తపాలెం గ్రామంలో ఉన్న అభయాంజనేయ స్వామి ఆలయ ఆరవ వార్షిక మహోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. వేద పండితులు అయినవోలు సుబ్బాచార్యులు బృందం చే ప్రత్యేక పూజా కార్యక్రమాలు కొనసాగాయి. రుద్ర సూక్త, మన్య సహిత అభిషేకాలు, సింధూర లేపనం , ఆకు పూజలు, అభిషేకాలు కొనసాగాయి.అనంతరం అన్న సంతర్పణ, కార్యక్రమం కొనసాగింది.

# ఎస్సై నాగమల్లేశ్వరరావును వీఆర్‌కు బదిలీ

**పోలీసుల వాహనంలో గంజాయి, మద్యం బాటిల్ వ్యవహారంపై ఉన్నతాధికారుల చర్యలు**



**సంతమాగులూరు, పెన్ పవర్, ఆగస్టు 21**

అద్దంకి మండలం శంకవరప్పాడు పరిధిలో పోలీసుల వాహనంలో గంజాయి, మద్యం బాటిల్ లభించిన వ్యవహారంపై పోలీసు ఉన్నతాధికారులు చర్యలు చేపట్టారు. ఈ ఘటనపై పలు దశల్లో విచారణ జరిపిన అనంతరం సంతమాగులూరు ఎస్సై నాగమల్లేశ్వరరావును వీఆర్‌కు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఘటనపై గుంటూరు రేంజ్ ఐజీ సర్వ శ్రేష్ఠ త్రిపాఠి, ప్రకాశం జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టినట్లు తెలిసింది. పోలీసు విధుల్లో ఉపయోగిస్తున్న కారులో గత కేసులో స్వాధీనం చేసుకున్న గంజాయి ఉండటం, అలాగే కారులో మద్యం బాటిల్ ఉండటంపై ఉన్నతాధికారులు తీవ్రంగా పరిగణించినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ఎస్సై నాగమల్లేశ్వరరావుపై వేకెన్సీ రిజర్వ్ (వీఆర్)కు బదిలీ వేటు వేసినట్లు తెలిసింది.

# ఎస్సైలపై వైసీపీ విష ప్రచారం తగదు

**బల్లికురవ, సంతమాగులూరు ఎస్సైలకు బీసీ నాయకుల మద్దతు**



**సంతమాగులూరు, పెన్ పవర్, ఆగస్టు 21**

బల్లికురవ, సంతమాగులూరు పోలీస్ స్టేషన్ ఎస్సైలపై వైసీపీ నాయకులు చేస్తున్న విష ప్రచారాన్ని రెండు మండలాల పరిధిలోని బీసీ నాయకులు తీవ్రంగా ఖండించారు. విధి నిర్వహణలో జరిగిన పొరపాటును అడ్డంపెట్టుకొని రాజకీయం చేయడం సరికాదని అన్నారు. ఈసందర్బంగా బీసీ నాయకుడు, సంతమాగులూరు మండల సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షులు సన్నెబోయిన గురుయాదవ్ మాట్లాడుతూ, పోలీసులు చట్టాన్ని అమలు చేసే క్రమంలో కొన్ని పొరపాట్లు జరగవచ్చు. వాటిని సరిదిద్దేందుకు ఉన్నతాధికారులు ఉంటారు. కానీ వాటిని ఆసరాగా చేసుకొని సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు చేయడం దారుణమని ఆగ్రహం వ్యక్తం చేశారు. మిగతా బీసీ నాయకులు కూడా ఈ ప్రచారాన్ని ముక్తకంఠంతో తప్పుబట్టారు. పోలీసులు ప్రజలకు రక్షణ కల్పించేవారని, వారిపై ఇలా బురద జల్లడం వల్ల సమాజంలో అశాంతి పెరుగుతుందని అన్నారు. పోలీసుల విధులకు ఆటంకం కలిగించేలా వ్యవహరించవద్దని హితవు పలికారు.


# బీసీలకు 34 శాతం రిజర్వేషన్ కల్పించడం గొప్ప విశేషం

**ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతించిన గురుయాదవ్**

**కూటమి ప్రభుత్వంలో బీసీలకు ప్రత్యేక హోదా**

**సంతమాగులూరు, పెన్ పవర్, ఆగస్టు 21**

రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించిన నిర్ణయాన్ని బీసీ నాయకుడు సన్నెబోయిన గురుయాదవ్ గొప్ప విషయం అని హర్షించారు. ఇది సామాజిక న్యాయానికి గొప్ప నిదర్శనమని కొనియాడారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ, బీసీలు రాష్ట్ర జనాభాలో అధికంగా ఉన్నారని, వారికి తగిన ప్రాధాన్యత దక్కాల్సిన అవసరం ఎంతో ఉందని తెలిపారు. 34 శాతం రిజర్వేషన్ వల్ల బీసీలకు రాజకీయంగా మరింత బలం చేకూరుతుందని, గ్రామీణ స్థాయిలో నాయకత్వ లక్షణాలు ఉన్నవారికి అవకాశం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. గతంలో బీసీలకు తగినన్ని స్థానాలు దక్కేవి కావని, ఇప్పుడు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో బీసీ వర్గాల ఆకాంక్షలు నెరవేరాయని పేర్కొన్నారు. ఈ నిర్ణయాన్ని రెండు మండలాల బీసీ నాయకులు కూడా స్వాగతించారని గురుయాదవ్ తెలిపారు. 34 శాతం రిజర్వేషన్‌తో స్థానిక సంస్థల్లో బీసీల ప్రాతినిధ్యం గణనీయంగా పెరుగుతుందని, ఇది సమాజంలో సమతుల్యతకు దోహదపడుతుందని ఆయన అభిప్రాయపడ్డారు.



# జిల్లావ్యాప్తంగా భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతాలు

**ప్రత్యేక అలంకరణల్లో కొలువుదీరిన వరలక్ష్మీదేవి**

**సామూహిక వ్రతాల్లో పెద్ద సంఖ్యలో పాల్గొన్న మహిళలు -పేరంటాలతో కళకళలాడిన ఇళ్లు**














**ఎన్.వి.ఎస్. రఘు ప్రదీప్, ఒంగోలు ఆగస్టు 21**

ఒంగోలు: శ్రావణమాసం రెండో శుక్రవారం సందర్భంగా ప్రకాశం జిల్లా వ్యాప్తంగా వరలక్ష్మీ వ్రత వేడుకలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే మహిళలు తమ ఇళ్లను శుభ్రపరిచి, ముంగిళ్లలో రంగవల్లులు తీర్చి, ప్రత్యేక పూజా మండపాలను ఏర్పాటు చేసి వరలక్ష్మీదేవిని అత్యంత భక్తిశ్రద్ధలతో పూజించారు. వరలక్ష్మీ వ్రతాన్ని పురస్కరించుకుని మహిళలు అమ్మవారిని వివిధ రకాల పుష్పాలు, పసుపు, కుంకుమ, పండ్లు, పూజా సామగ్రితో సుందరంగా అలంకరించారు. కొన్ని ప్రాంతాల్లో ప్రత్యేకంగా తయారు చేసిన కలశాలను ఏర్పాటు చేసి, వాటిపై అమ్మవారి ముఖాన్ని ప్రతిష్ఠించి పూజలు నిర్వహించారు. అమ్మవారి అలంకరణలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. జిల్లాలోని పట్టణాలు, మండల కేంద్రాలు, గ్రామాల్లో మహిళలు పెద్ద సంఖ్యలో సామూహికంగా వరలక్ష్మీ వ్రతాలను నిర్వహించారు. పూజా కార్యక్రమాల సందర్భంగా వరలక్ష్మీదేవికి ప్రత్యేక నైవేద్యాలు సమర్పించి, అష్టోత్తర శతనామావళి, లక్ష్మీ అష్టకం, వరలక్ష్మీ వ్రత కథలను భక్తిశ్రద్ధలతో పఠించారు. కుటుంబ సభ్యులు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని, కుటుంబాల్లో సిరిసంపదలు వెల్లివిరియాలని అమ్మవారిని ప్రార్థించారు. తిరుచానూరులోని శ్రీ పద్మావతి అమ్మవారు పద్మ వరలక్ష్మీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారి దర్శనం కోసం భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అలంకరణలు నిర్వహించడంతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

జిల్లాలోని పలు ప్రాంతాల్లో మహిళలు సామూహికంగా వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించుకుని పరస్పరం వాయనాలు ఇచ్చిపుచ్చుకున్నారు. పసుపు, కుంకుమ, పూలు, పండ్లు, తాంబూలాలతో వాయనాలను సిద్ధం చేసి ఇతర మహిళలకు అందజేశారు. వ్రతానికి హాజరైన మహిళలు పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకుంటూ, అమ్మవారి ఆశీస్సులు అందరికీ కలగాలని ఆకాంక్షించారు. సాయంత్రం వేళ పలు ఇళ్లలో పేరంటాలను ఏర్పాటు చేశారు. బంధువులు, స్నేహితులు, ఇరుగుపొరుగు మహిళలను ఆహ్వానించి తాంబూలాలు అందజేశారు. దీంతో పలు ప్రాంతాల్లోని ఇళ్లు మహిళల సందడితో కళకళలాడాయి. యువతులు, మహిళలు, వృద్ధులు పెద్ద సంఖ్యలో ఈ పూజా కార్యక్రమాల్లో పాల్గొని వరలక్ష్మీదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రావణమాసంలో వరలక్ష్మీ వ్రతానికి విశిష్టమైన ప్రాధాన్యత ఉండటంతో మహిళలు ఎంతో నియమనిష్ఠలతో వ్రతాన్ని ఆచరించారు. ఉదయం నుంచి ఉపవాస దీక్షతో పూజల్లో పాల్గొని, అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి, అనంతరం ప్రసాదాలను స్వీకరించారు. పలు ప్రాంతాల్లో మహిళలు సమూహాలుగా చేరి వరలక్ష్మీ వ్రత కథను ఆలకించారు. వరలక్ష్మీ వ్రతం సందర్భంగా జిల్లా వ్యాప్తంగా ఆలయాలు, ఇళ్లు పూల అలంకరణలతో ప్రత్యేక శోభను సంతరించుకున్నాయి. ఎటు చూసినా పసుపు, కుంకుమ, పూల సువాసనలు, భక్తిగీతాలతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. భక్తిశ్రద్ధలతో నిర్వహించిన వరలక్ష్మీ వ్రతాలతో ప్రకాశం జిల్లా అంతటా పండుగ శోభ వెల్లివిరిసింది.

# ఎన్‌ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌కు ఎంపికైన విద్యార్థులకు డాక్టర్ మొర్రి పిచ్చయ్య అభినందనలు



**గిద్దలూరు పెన్ పవర్ ఆగస్టు 21**

జాతీయ ప్రతిభా పరీక్షలో ప్రతిభ కనబరిచి స్కాలర్‌షిప్‌కు ఎంపికైన గిద్దలూరు పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, యాదవ బజార్‌కు చెందిన ఎనిమిదో తరగతి విద్యార్థులు హమీద్, ఫర్వీన్‌లను డాక్టర్ మొర్రి పిచ్చయ్య అభినందించారు.ఈ సందర్భంగా డాక్టర్ మొర్రి పిచ్చయ్య మాట్లాడుతూ విద్యార్థులు ప్రతిభా పరీక్షకు సిద్ధమయ్యేందుకు అవసరమైన స్టడీ మెటీరియల్‌ను ఉచితంగా అందించడం జరిగిందని తెలిపారు. విద్యార్థుల పట్టుదల, క్రమశిక్షణతో పాటు పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ సిబ్బంది అందించిన ప్రోత్సాహం, మార్గదర్శకత్వం ఈ విజయానికి ప్రధాన కారణమని పేర్కొన్నారు.విద్యార్థుల విజయాన్ని అభినందిస్తూ హమీద్, ఫర్వీన్‌లకు పెన్నులను బహూకరించి, భవిష్యత్తులో ఉన్నత లక్ష్యాలను సాధించి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. విద్యార్థుల ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడం ద్వారా వారిలో ఆత్మవిశ్వాసం పెంపొందుతుందని, ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు అవసరమైన విద్యా సహాయాన్ని అందించేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని ఆయన అన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు నారాయణ, ఉపాధ్యాయులు రంగస్వామి, జీవన్, లీలావతి, అరుణ, గౌహర్, వాహిద్ తదితరులు డాక్టర్ మొర్రి పిచ్చయ్యను సన్మానించి విద్యార్థులకు అందిస్తున్న ప్రోత్సాహాన్ని అభినందించారు. "ప్రతిభకు ప్రోత్సాహం -- విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాట" అనే స్ఫూర్తితో విద్యార్థులను ప్రోత్సహిస్తున్న డాక్టర్ మొర్రి పిచ్చయ్య సేవలను పలువురు ప్రశంసించారు.

# కసినేపల్లి గ్రామంలో ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమం నిర్వహణ





**కొమరోలు పెన్ పవర్ ఆగస్టు 21.**

కొమరోలు మండలం కసినేపల్లి గ్రామంలో శుక్రవారం తెలుగుదేశం పార్టీ నేతలు కార్యకర్తలు ఇంటింటి తెలుగుదేశం పార్టీ కార్యక్రమం ముమ్మరంగా చేపట్టారు. చింతలపల్లి పంచాయతీ తెలుగుదేశం పార్టీ నాయకులు సారే ఎల్లాల నాయుడు ఆధ్వర్యంలో ఇంటింటి తెలుగుదేశం పార్టీ నిర్వహించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక రెడ్డి సూచనలు సలహా మేరకు తెలుగుదేశం పార్టీ నాయకులు ఇంటింటికి తెలుగుదేశం పార్టీ కార్యక్రమం నిర్వహించారు..ఆ కార్యక్రమానికి తెలుగుదేశం పార్టీ మండల కో కన్వీనర్ ముత్తుముల ఎల్లారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆ సందర్భంగా నాయకులు ఆ గ్రామంలో ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంచిపెట్టి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు.ఆ కార్యక్రమంలో చింతలపల్లి తెలుగుదేశం పార్టీ నాయకులు ఊసా రాముడు, కొండయ్య సారే ఎల్లాల నాయుడు, కస్నేపల్లి గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా వర లక్ష్మీ వ్రతాలు

**పెన్ పవర్ గిద్దలూరు ఆగస్ట్ 21**




గిద్దలూరు ,పరిసర ప్రాంతాల్లో శ్రావణ మాసం రెండవ శుక్రవారం నాడు ముత్తైదువులు భక్తి శ్రద్ధలతో వర లక్ష్మీ వ్రతాలు ఘనంగా నిర్వహించారు. ఇంటింటా వర లక్ష్మీ అమ్మ వార్ల ను ఏర్పాటు చేసి వర లక్ష్మీ వ్రత నోము ను నిర్వహించారు. అమ్మ వారికి ముత్తై దువులకు వాయనాలు సమర్పించారు. సుమంగళ లు వేకువ జామున లేచి తల స్నానం చేసి నూతన వస్త్రాలు ధరించి మండపం లో వర లక్ష్మీ దేవి ని ప్రతిష్టించి పసుపు కుంకుమ ల తో అమ్మ వారిని అలంకరించుకున్నారు. ఇదే సందర్భంలో హరిద్రా గణపతి కి ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం వర లక్ష్మీ వ్రత పూజలు ఘనంగా నిర్వహించారు. అమ్మ వారి కలశ శీ ను సుందరంగా అలంకరించారు.అమ్మవారి కథ ను చదువుకొని,అష్టోత్తర శతనామావలి తో వివిధ పరిమళ పుష్పాల తో పూజ ను నిర్వహించి తోరణాల ను ధరించారు. అనంతరం అమ్మ వారికి ముత్తై దువులకు వివిధ రకాల పిండి వంటకాల తో వాయనా ల ను సమర్పించారు. స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయం లో సామూహిక వర లక్ష్మీ వ్రతా ల ను నిర్వహించారు. కుటుంబ సుఖ సంతోషాలు సౌభాగ్యం కోసం మహిళలు ఈ వర లక్ష్మీ వ్రతాల ను నిర్వహిస్తారు. ఈ సందర్భంగా పట్టణంలో పరిసర ప్రాంతాల్లో పండుగ వాతావరణం నెలకొంది. పలు అమ్మ వారి ఆలయాలు మహిళా భక్తుల తో కిటకిట లాడాయి.

# ఏ ఈ ఈ పోస్టుల భర్తీకి 23 నుండి సి బి టి. పరీక్షలు

**- ఏ పి సి పిడిసిఎల్ సి ఎం డి పి పుల్లా రెడ్డి వెల్లడి**

**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్, ఒంగోలు ఆగస్టు 21**



రాష్ట్ర విద్యుత్ సంస్థల్లో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (ఎలక్ట్రికల్) పోస్టుల భర్తీకి ఈ నెల 23 నుంచి 27 వరకు కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ (సీబీటీ) విధానంలో పరీక్షలు నిర్వహించనున్నట్లు ఏపీసీపీడీసీఎల్ సీఎండీ పి.పుల్లారెడ్డి తెలిపారు. పరీక్షలను పూర్తి పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు. పరీక్షలు రోజుకు రెండు షిఫ్టుల్లో జరుగుతాయి. మొదటి షిఫ్ట్ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, రెండో షిఫ్ట్ మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు నిర్వహిస్తారు. అభ్యర్థులు ఒరిజినల్ హాల్‌టికెట్‌తో పాటు ఆధార్, పాన్, ఓటర్ ఐడీ, పాస్‌పోర్ట్ లేదా డ్రైవింగ్ లైసెన్స్ వంటి ఫొటో గుర్తింపు కార్డుల్లో ఏదో ఒకటి తప్పనిసరిగా తీసుకురావాలని సూచించారు. పరీక్షా కేంద్రాల్లో ఫేస్ వెరిఫికేషన్, మెటల్ డిటెక్టర్‌తో తనిఖీలు చేపడుతున్నట్లు తెలిపారు. మొబైల్ ఫోన్లు, స్మార్ట్ వాచీలు, కాలిక్యులేటర్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు, పుస్తకాలు, కాగితాలు అనుమతించబోమన్నారు. ఉద్యోగం ఇప్పిస్తామంటూ దళారులు చేసే ప్రచారాన్ని నమ్మొద్దని, అధికారిక ప్రకటనలను మాత్రమే విశ్వసించాలని సీఎండీ సూచించారు.

# ఏపీలోనూ 22 ఏ ప్రకంపనలు

**విజయవాడ, ఆగస్టు 21 పెన్ పవర్:**
మాజీ ఐపీఎస్ అధికారి, ఏపీ ఇంటెలిజెన్స్ పూర్వ అధిపతి ఏబీ వెంకటేశ్వరరావు ఇటీవల ఏపీ కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటం చేస్తున్నారు. ముఖ్యంగా 22ఏ నిషేధిత భూముల జాబితా పరిరక్షణ ఆందోళనల్లో చురుగ్గా పాల్గొనడం రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వ హయాంలో తీవ్రమైన వేధింపులకు, సస్పెన్షన్‌కు గురై సత్యమేవ జయేతే అంటూ పోరాడిన ఆయన, టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ పార్టీలోకి చేరకపోవడం, పైగా పాలనా లోపాలపై గళమెత్తడం వెనుక అసలు ప్లాన్ ఏంటనేది ఆసక్తికర చర్చకు దారితీసిందిఏబీ వెంకటేశ్వరరావును టీడీపీ పార్టీలోకి చేర్చుకోనందుకే ఆయన అసంతృప్తితో విమర్శలు చేస్తున్నారు. తాను టీడీపీలో చేరాలని గతంలో అనుకున్నప్పటికీ సరైన స్పందన రాలేదని ఆయనే పలు ఇంటర్వ్యూల్లో చెప్పారు. పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ పదవి ఇచ్చినా ఆయన తీసుకోలేదు. అందుకే ఆ తర్వాత ఆయన మరికొంత మంది ఇతరులతో కలిసి సెంటర్ ఫర్ లిబర్టీ అనే వేదిక ద్వారా 22ఏ నిషేధిత భూముల జాబితా కారణంగా నష్టపోతున్న లక్షలాది మంది ప్రజల హక్కుల కోసం క్షేత్రస్థాయిలో పోరాడుతున్నారు. ప్రభుత్వ యంత్రాంగం, రెవెన్యూ అధికారులు ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని, చంద్రబాబు నాయుడు, నారా లోకేష్ స్థాయి నేతలకు అధికారుల వాస్తవాలు సరిగ్గా చేరవేడం లేదని ఆయన బహిరంగంగా వ్యాఖ్యానిస్తున్నారు. ఈ భూముల సమస్య ప్రజా ఉద్యమంగా మారడంతో ప్రభుత్వంపై ఒత్తిడి పెంచే ఆయుధంగా దీనిని మలుచుకున్నారు. రోల్ బ్యాక్ 22ఏ పేరుతో ఉద్యమం చేస్తున్నారు. ఇక సొంత పార్టీ ఏర్పాటు ప్రకటన విషయానికి వస్తే, ఏబీ వెంకటేశ్వరరావు తన వైఖరిని స్పష్టం చేశారు. ఏదో ఒక రాజకీయం వెనుక నడవడం కంటే సమాజంలో మార్పు కోసం, పౌర హక్కుల పరిరక్షణ కోసం తమ భావసారూప్యత కలిగిన వ్యక్తులతో కలిసి కొత్త రాజకీయ పార్టీని స్థాపిస్తానని ప్రకటించారు. అధికారం పొందేందుకు కాకపోయినా, ఒక బలమైన వాచ్‌డాగ్‌గా, ఒత్తిడి గ్రూప్‌గా పనిచేయడానికే ఈ నూతన వేదిక ఆలోచన చేస్తున్నట్లు తెలుస్తోంది. తెలుగుదేశం పార్టీ ఇలాంటి మాజీ అధికారులను , సానుభూతిపరులను ఎందుకు దూరం చేసుకుంటోందనే ప్రశ్నకు రాజకీయ వ్యూహాలే సమాధానంగా కనిపిస్తున్నాయి. మాజీ అధికారుల స్వేచ్ఛా ప్రకటనలు ప్రభుత్వ నిర్ణయాలకు అవరోధంగా మారడం, లేదా పార్టీకి క్యాడర్ ఆధారిత నాయకత్వమే ప్రాధాన్యత కావడం ఇందుకు కారణం కావచ్చు. అదే సమయంలో, సుదీర్ఘకాలం ఇంటెలిజెన్స్ వైపు పనిచేసిన అనుభవం ఉన్న వెంకటేశ్వరరావు ప్రభుత్వాన్ని నియంత్రించే లోపాలను పసిగట్టి వేలెత్తి చూపిస్తుండటంతో కూటమి సర్కారుకూ ఇది ఇబ్బందికరంగా పరిణమించింది. తన చట్టపరమైన పోరాటం ముగిసిన తర్వాత, సమాజంలో ఒక ఇండిపెండెంట్ లీడర్‌గా, ప్రజా సమస్యలపై పోరాడే సివిల్ సొసైటీ వాయిస్‌గా తనను తాను నిలబెట్టుకునేందుకు వేస్తున్న వ్యూహాత్మక అడుగుగా దీనిని చూడొచ్చు.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పో. 12 సెం.మీ. వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి'
93948 55244
షరతులు వర్తిస్తాయి

## అసెంబ్లీ బహిష్కరణ మైలేజ్.. డ్యామేజా...

**విజయవాడ, ఆగస్టు 21 పెన్ పవర్:**
ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తీసుకున్న తాజా నిర్ణయం మరోసారి చర్చకు దారితీసింది. రాష్ట్ర అసెంబ్లీ వర్షాకాల సమావేశాలకు పార్టీ ఎమ్మెల్యేలు హాజరు కాకూడదని నిర్ణయించడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. ఎన్నికల తర్వాత సభలో తమకు దక్కాల్సిన ప్రతిపక్ష హోదా విషయంలో న్యాయం జరగలేదన్నది వైసీపీ ప్రధాన వాదనగా ఉంది. ఈ అంశాన్నే కేంద్రంగా చేసుకుని అసెంబ్లీ సమావేశాలకు దూరంగా ఉండాలని పార్టీ నిర్ణయించింది. 2024 ఎన్నికల్లో వైసీపీకి 11 అసెంబ్లీ స్థానాలు మాత్రమే దక్కాయి. కూటమి పార్టీలైన తెలుగుదేశం పార్టీ , జనసేన , బీజేపీ కలిసి భారీ మెజారిటీతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశాయి. దీంతో శాసనసభలో వైసీపీ సంఖ్యాబలం గణనీయంగా తగ్గిపోయింది. ఎన్నికల ఫలితాల తర్వాత నుంచే ప్రతిపక్ష హోదా అంశం ఆ పార్టీ రాజకీయ చర్చల్లో కీలకంగా మారింది. వైసీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సభలో తమ పార్టీకి తగిన ప్రాధాన్యం ఇవ్వడం లేదని పలుమార్లు ఆరోపించారు. మరోవైపు ప్రభుత్వం, కూటమి నేతలు మాత్రం ప్రతిపక్ష హోదాకు సంబంధించిన నిబంధనలు, సభలో పార్టీ బలాన్ని ప్రస్తావిస్తూ వైసీపీ వాదనను అంగీకరించడం లేదు. దీంతో రెండు వైపులా రాజకీయ విమర్శలు కొనసాగుతున్నాయి. అయితే అసెంబ్లీకి వెళ్లకుండా ఉండటం వల్ల వైసీపీకి రాజకీయంగా ఎంత మేరకు ప్రయోజనం కలుగుతుందన్నది ఇప్పుడు అసలు ప్రశ్నగా మారింది. ప్రజల సమస్యలను నేరుగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు శాసనసభ ఒక ముఖ్యమైన వేదిక. నిరుద్యోగం, రైతుల సమస్యలు, సంక్షేమ పథకాల అమలు, ధరల పెరుగుదల, అభివృద్ధి కార్యక్రమాలు వంటి అంశాలపై అధికార పక్షాన్ని ప్రశ్నించే అవకాశం ప్రతిపక్ష సభ్యులకు ఉంటుంది. అలాంటి అవకాశాన్ని స్వయంగా వదులుకోవడం వల్ల పార్టీకి నష్టం జరిగే ప్రమాదం ఉందనే అభిప్రాయాలు కూడా వినిపిస్తున్నాయి. మరోవైపు వైసీపీ తన రాజకీయ పోరాటాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లే ప్రయత్నం చేస్తోంది. అసెంబ్లీకి గైర్హాజరైనప్పటికీ పార్టీ నాయకులు, కార్యకర్తల ద్వారా ప్రభుత్వ నిర్ణయాలను విమర్శించడం, ప్రజా సమస్యలను ప్రస్తావించడం కొనసాగించవచ్చు. సోషల్ మీడియా, బహిరంగ కార్యక్రమాలు, పార్టీ సమావేశాలను ఇందుకు ఉపయోగించుకునే అవకాశం ఉందిశాసనమండలిలో మాత్రం వైసీపీకి కొంత బలం ఉండటంతో అక్కడి వేదికను ప్రభుత్వాన్ని ప్రశ్నించేందుకు ఉపయోగించుకోవాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో ఒకవైపు అసెంబ్లీకి దూరంగా ఉంటూ, మరోవైపు మండలిలో ప్రభుత్వాన్ని నిలదీయడం అనే ద్వంద్వ వ్యూహం ఆసక్తిని కలిగిస్తోంది. ఇక వరుసగా సభకు గైర్హాజరైతే సభ్యుల హాజరుకు సంబంధించిన రాజ్యాంగ నిబంధనలు కూడా ప్రస్తావనకు వస్తున్నాయి. అయితే గైర్హాజరుపై అనుమతులు, సభా విధానాలు వంటి అంశాలు కూడా ఇందులో కీలకంగా ఉంటాయి. కాబట్టి కేవలం గైర్హాజరు ఆధారంగా సభ్యత్వంపై తక్షణ నిర్ణయం వస్తుందని భావించడం సరికాదు. మొత్తానికి వైసీపీ అసెంబ్లీ బహిష్కరణ నిర్ణయం ఆ పార్టీ రాజకీయ వ్యూహానికి పరీక్షగా మారింది. ప్రతిపక్ష హోదా అంశాన్ని ప్రజల్లోకి ఎంత బలంగా తీసుకెళ్తుంది, అసెంబ్లీకి దూరంగా ఉండటం వల్ల రాజకీయంగా లాభమా నష్టమా అన్నది కాలమే తేల్చనుంది. ప్రజా సమస్యలపై పోరాటానికి సభా వేదికను ఎంచుకుంటుందా, లేక బయట నుంచే ప్రభుత్వంపై ఒత్తిడి కొనసాగిస్తుందా అనేది రాబోయే రోజుల్లో ఆసక్తికరంగా మారనుంది.

### వైసీపీ రికార్డు

చట్ట సభలే ప్రజాస్వామ్య వేదికలు. అక్కడ అన్ని పక్షాలు కలిసి ప్రజా సమస్యల మీద చర్చిస్తాయి. అలాంటి వేదికలను బహిష్కరించడం అన్నది తొలి తరంలో జరిగేది కాదు, అసలు వాకౌట్లు కూడా అప్పట్లో తక్కువగా ఉండేవి. అయితే రాను రానూ రాజకీయం పెరిగి సభలకే దుమ్మా కొడుతున్నారు. ఇక దేశంలో శాసనసభ మొత్తాన్ని లేదా సమావేశాలను ఒక నిర్దిష్ట రాజకీయ పార్టీ పూర్తిగా బహిష్కరించడం అనేది ఎక్కడా లేదని అంటున్నారు. అదే సమయంలో ఇది రాష్ట్రాల వారీగా అక్కడి రాజకీయ పరిస్థితులు అధికార ప్రతిపక్షాల మధ్య వివాదాలు లేదా సభలో తమకు సముచిత గౌరవం దక్కలేదనే కారణాలపై ఈ బహిష్కరణలు ఆధారపడి ఉంటాయి. మరో వైపు చూస్తే భారతదేశంలో అసెంబ్లీలను బహిష్కరించే పార్టీలు ఉన్నా పాక్షికంగా పరిమితంగా జరిగిన సందర్భాలు ఉన్నాయని అంటున్నారు. కొన్ని సందర్భాలలో ప్రతిపక్ష పార్టీలు నిరసనగా సభలకు దూరంగా ఉంటూ వచ్చిన నేపథ్యం ఉంది. అయితే ఒక ప్రధాన ప్రతిపక్ష పార్టీ మొత్తం అసెంబ్లీ సమావేశాలకు దూరంగా ఉండటాన్ని ప్రజాస్వామ్య వ్యవస్థలో బాధ్యతారాహిత్యంగా అధికార పార్టీలు విమర్శిస్తుంటాయి. సభలో చర్చల ద్వారానే ప్రజా సమస్యలకు పరిష్కారం లభిస్తుందని, బహిష్కరణలు సరైనవి కాదని రాజకీయ విశ్లేషకులు సైతం అభిప్రాయపడుతుంటారు. ఏపీలో చూస్తే మూడు సందర్భాలలో ముగ్గురు నాయకులు అసెంబ్లీ బహిష్కరణ పిలుపు ఇచ్చారు. వారే ఎన్టీఆర్, జగన్ చంద్రబాబుగా చెప్పాలి మూడున్నర దశాబ్దాల క్రితం చూస్తే ఎన్టీఆర్ 1989లో విపక్షంలో ఉన్నారు. అయితే ఆయన పార్టీకి చెందిన వారు అంతా సభకు హాజరయ్యారు. అప్పట్లో ఉప నాయకులుగా చంద్రబాబు ఇతర నేతలు కలసి టీడీపీని అసెంబ్లీలో నడిపించారు. ఇక జగన్ అయితే 2017లో అసెంబ్లీకి రావడం లేదని ఒక దండం పెట్టి మరీ జనంలోకి పాదయాత్ర కోసం వెళ్ళారు. అయితే జగన్ అప్పటికి మూడేళ్ళ పాటు అసెంబ్లీకి హాజరయ్యేవారు. చంద్రబాబు విషయం తీసుకుంటే ఆయన 2021లో వైసీపీ ప్రభుత్వ హయాంలో సభలో తనకు అవమానం జరిగిందంటూ చంద్రబాబు అసెంబ్లీని బహిష్కరించి మళ్లీ అధికారంలోకి వస్తేనే అసెంబ్లీలో అడుగుపెడతానని శపథం చేసి వెలువడిన సందర్భాన్ని రాజకీయ ప్రత్యర్థులు ప్రస్తావిస్తుంటారు ఇక అసెంబ్లీలను బహిష్కరించడం అన్న దానికి బీజం తమిళనాడులో జయలలిత హయాంలో పడింది అని చెప్పాల్సి ఉంటుంది. 1989 మార్చి 25న తమిళనాడు అసెంబ్లీలో జరిగిన ఘోర అవమానం కారణంగా ప్రతిపక్ష నేతగా ఉన్న జయలలిత సభను బహిష్కరించారు. డీఎంకే సభ్యుల దాడిలో అవమానానికి గురైన ఆమెమళ్ళీ ముఖ్యమంత్రిగా అడుగుపెడతాను అని భీష్మ ప్రతిజ్ఞ చేసి సభను వీడారు. ఈ సంఘటన ఆమె రాజకీయ జీవితంలో ఒక కీలక మలుపుగా నిలిచింది. ప్రజల్లో ఆమెకు సానుభూతి పెరిగింది. సరిగ్గా రెండేళ్ల తర్వాత 1991 ఎన్నికల్లో అఖండ విజయం సాధించి, తాను అనుకున్నట్టుగానే తమిళనాడు తొలి మహిళా పూర్తికాల ముఖ్యమంత్రిగా ఘనంగా అసెంబ్లీలో అడుగుపెట్టారు అయితే వైసీపీ మాత్రం 2024లో కొత్త అసెంబ్లీ ఏర్పాటు అయ్యాక అసెంబ్లీకి వెళ్ళడం మానుకుంది. ఆ పార్టీ తనకు 11 సీట్లు వచ్చినా ప్రధాన ప్రతిపక్ష పాత్ర కోరుతోంది. అయితే రూల్స్ మాత్రం అందుకు ఒప్పుకోవని స్పీకర్ ఆఫీసు చెబుతోంది. ఈ నేపథ్యంలో అసెంబ్లీకి వైసీపీ దూరంగా ఉంటోంది. ఇప్పటికి 26 నెలలు గడచిపోయినా వైసీపీ అసెంబ్లీ వైపు చూడడం లేదు, దీని మీద ముఖ్యమంత్రి చంద్రబాబు తాజాగా విమర్శలు చేశారు. ప్రజాస్వామ్యంలో అసెంబ్లీని ప్రతిపక్షాలు బహిష్కరించడం సరికాదని అన్నారు. ప్రజా సమస్యలపై సభలోనే తేల్చుకోవాలని ఆయన అన్నారు. వైసీపీ తీరును తప్పుపడుతూ తన రాజకీయ జీవితం మొత్తంలో ఇలాంటివి చూడలేదని అన్నారు. దేశంలో కూడా ఈ రకమైన పరిణామాలు ఎక్కడైనా జరిగాయో లేవో కానీ ఈ విషయంలో వైసీపీది కొత్త రికార్డు అని ప్రత్యర్థులు విమర్శిస్తున్నారు.

# పొలిటికల్ ఆడిటింగ్ పూర్తి - విజయసాయిరెడ్డి పార్టీ టార్గెట్ ఇదే !



**నెల్లూరు, ఆగస్టు 21 పెన్ పవర్:**
రాజకీయ సన్యాసం తీసుకుంటున్నట్లు ప్రకటించి రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేసిన మాజీ ఎంపీ వి.విజయసాయిరెడ్డి.. ఇప్పుడు అనూహ్యంగా తిరుమల శ్రీవారి సాక్షిగా సరికొత్త రాజకీయ పార్టీ ఏర్పాటును ప్రకటించారు. ఈ నెలలోనే విజయవాడ వేదికగా పార్టీ పేరు, జెండా, విధివిధానాల రోడ్‌మ్యాప్‌ను ప్రకటిస్తానని ఆయన వెల్లడించారు. రాజకీయ సన్యాసం తీసుకుంటున్నట్లు ప్రకటించి రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేసిన మాజీ ఎంపీ వి.విజయసాయిరెడ్డి.. ఇప్పుడు అనూహ్యంగా తిరుమల శ్రీవారి సాక్షిగా సరికొత్త రాజకీయ పార్టీ ఏర్పాటును ప్రకటించారు. ఈ నెలలోనే విజయవాడ వేదికగా పార్టీ పేరు, జెండా, విధివిధానాల రోడ్‌మ్యాప్‌ను ప్రకటిస్తానని ఆయన వెల్లడించారు. అయితే, వైఎస్సార్‌సీపీలో నంబర్ టూగా చక్రం తిప్పి, దేశంలోనే అగ్రశ్రేణి ఆడిటింగ్ మాస్టర్‌గా పేరొందిన విజయసాయిరెడ్డి.. కేవలం ప్రజాసేవ కోసమే కొత్త దుకాణం తెరుస్తున్నారంటే ఎవరూ నమ్మే పరిస్థితి లేదు. రాజకీయాల్లో సొంత పార్టీ నడపడం అంటే ఆర్థికంగా భారీ వ్యయంతో కూడుకున్న వ్యవహారమని తెలిసినా ఆయన ఈ అడుగు వేస్తున్నారంటే, ఆ పెట్టుబడి వెనుక అంతకుమించిన భారీ ప్రయోజనాలు, సరికొత్త లెక్కలు దాగి ఉన్నాయని స్పష్టమవుతోంది. ఈ సరికొత్త రాజకీయ ప్రయోగం వెనుక ప్రధానంగా వినిపిస్తున్న వాదన వ్యక్తిగత, వ్యాపార రక్షణ కవచం . గత ఐదేళ్ల పాలనలో విశాఖపట్నం భూముల వ్యవహారాలు, దసపల్లా భూ వివాదాలు, లిక్కర్ లావాదేవీలు, అనేక ఆస్తుల క్రయవిక్రయాల్లో ఆయనపై లెక్కలేనన్ని తీవ్ర ఆరోపణలు వెల్లువెత్తాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పాత ఫైళ్లు తిరగదోడే ప్రమాదం ఉండటం, మరోవైపు సీబీఐ, ఈడీ అక్రమాస్తుల కేసుల విచారణలు కొనసాగుతుండటంతో.. కేవలం సాధారణ పౌరుడిగా ఉంటే చట్టపరమైన ఉచ్చు బిగుస్తుందన్న భయం ఆయనను వెంటాడుతోందన్న ప్రచారం ఉంది. రేపు ఏ విచారణ సంస్థ దర్యాప్తు చేపట్టినా, రాజకీయ కక్షసాధింపు , కొత్త పార్టీ పెట్టినందుకే వేధింపులు అనే ముద్ర వేసి ప్రజాక్షేత్రంలో సానుభూతి పొందడానికి ఒక రాజకీయ పార్టీ హోదాను రక్షణ కవచంగా వాడుకోవాలన్నదే ఆయన మొదటి వ్యూహం కావొచ్చు. మరో బలమైన రాజకీయ కోణం బీజేపీ పెద్దల గేమ్ ప్లాన్ . ఢిల్లీలోని కమలనాథులతో విజయసాయిరెడ్డికి ఉన్న బలమైన సంబంధాలు అందరికీ తెలిసినవే. ఏపీలో కూటమి బలంగా ఉండటంతో నేరుగా బీజేపీలో చేరడానికి సాంకేతిక, రాజకీయ ఇబ్బందులు ఉన్నాయి. ఈ క్రమంలో ప్రభుత్వ వ్యతిరేక ఓటు లేదా ఒక వర్గం అసంతృప్తి ఓట్లు వైఎస్సార్‌సీపీకి మళ్లీ గంపగుత్తగా పడకుండా నిరోధించేందుకు ఒక ప్రత్యేక టూల్ గా ఈ కొత్త పార్టీని రంగంలోకి దింపుతున్నారా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. తటస్థంగా ఉంటూనే, తెరవెనుక ఢిల్లీ పెద్దల ప్రయోజనాలకు అనుగుణంగా పావులు కదిపేందుకు ఈ వేదిక ఉపయోగపడుతుందని భావిస్తున్నారు. ఇక మూడో కోణం వైఎస్ జగన్మోహన్ రెడ్డితో మైండ్ గేమ్. వైఎస్సార్‌సీపీలో సజ్జల రామకృష్ణారెడ్డి ప్రాబల్యం పెరిగి తనను పక్కనపెట్టిన నాటి నుంచి రగిలిపోతున్న విజయసాయిరెడ్డి.. తాడేపల్లి ప్యాలెస్‌కు గట్టి చెక్ పెట్టాలని చూస్తున్నారు. వైఎస్ కుటుంబానికి చెందిన నమ్మకస్తుడైన ఆడిటర్‌గా పార్టీలోని ప్రతి నాయకుడి ఆర్థిక మూలాలు, అంతర్గత బలహీనతలు, క్షేత్రస్థాయి నెట్‌వర్క్ ఆయనకు కొట్టినపిండి. కొత్త పార్టీ వేదిక ద్వారా వైఎస్సార్‌సీపీలోని అసంతృప్త నేతలను, ద్వితీయ శ్రేణి కేడర్‌ను తనవైపు తిప్పుకుని జగన్ ఓటు బ్యాంకును చీల్చగలనని బ్లాక్‌మెయిల్ చేసే ఎత్తుగడ కూడా ఇందులో దాగి ఉండవచ్చని పార్టీ వర్గాలు గుసగుసలాడుతున్నాయి. ఒక ప్రాంతీయ పార్టీని స్థాపించి క్షేత్రస్థాయిలో నిలబెట్టడం అనేది సాధారణ వ్యవహారం కాదు. కేవలం మీడియా దృష్టిని ఆకర్షించడానికో లేక బేరసారాల కోసమో పెట్టిన పార్టీలు కాలగర్భంలో కలిసిపోయిన చరిత్ర ఏపీలో ఎన్నో ఉన్నాయి. విజయసాయిరెడ్డి వేస్తున్న ఈ పాచికల వెనుక ఉన్న అసలు లక్ష్యం --- కేసుల నుంచి ఆత్మరక్షణ కోసమా, బీజేపీ రాజకీయ ప్రయోగమా లేక జగన్‌పై ప్రతీకారమా అన్నది ఆయన పార్టీ అధికారిక ప్రకటన చేసి మొదటి అడుగు వేసిన తర్వాతే పూర్తి స్పష్టత రానుంది.

# ఉనికి' కోసమే జగన్ ఆరాటం !



**విజయవాడ, ఆగస్టు 21 పెన్ పవర్:**
ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల సన్నాహాలు ప్రధాన ప్రతిపక్షమైన వైఎస్సా ర్‌సీపీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డిలో ఆందోళనను రేకెత్తి స్తున్నాయి. తాడేపల్లి ప్యాలెస్‌లో నిర్వహిస్తున్న వరుస నియోజకవర్గాల సమీక్షా సమావేశాల్లో కేడర్‌నుద్దేశించి ఆయన చేస్తున్న ప్రసంగాలు దీనిని స్పష్టం చేస్తున్నాయి. గెలుపోట ములతో సంబంధం లేకుండా ప్రతి పంచాయతీ, వార్డులో తప్పనిసరిగా నామినేషన్లు వేసి తీరాలని ఆయన పార్టీ శ్రేణులను ఆదేశిస్తున్న తీరు.. పార్టీ బలమైన స్థితిలో ఉండి ఇచ్చే పిలుపులా కాకుండా, కనీస రాజకీయ ఉనికిని కాపాడు కోవడానికి పడుతున్న తాపత్రయంలా కనిపిస్తోందని విశ్లేషకు లు భావిస్తున్నారు. ఈ ఒత్తిడి వెనుక బలమైన రాజకీయ భయం దాగి ఉంది. ఒకవేళ స్థానిక ఎన్నికల బరిలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు నిలబడకపోతే, క్షేత్రస్థాయిలో కేడర్ పూర్తిగా నిర్లిప్తతలోకి జారిపోయిందన్న స్పష్టమైన సంకేతం ప్రజల్లోకి వెళ్తుంది. అసెంబ్లీలో 11 సీట్లకు పరిమితమైన తర్వాత, పార్టీ ఇంకా సజీవంగానే ఉందని నిరూపించుకోవడానికి చేపట్టే పర్యటనలు, రోడ్‌షోలు, భవిష్యత్ రాజకీయ వ్యూహాలు అన్నీ ఒక్కసారిగా తేలిపోతాయి. ఎన్నికల్లో పోటీ లేకపోవడం వల్ల ప్రత్యర్థి పక్షాలకు ఏకగ్రీవాలు దక్కితే, అది పార్టీ నైతిక స్థైర్యాన్ని పూర్తిగా దెబ్బతీస్తుందనే భయంతోనే ఓడిపోయినా పర్వాలేదు.. బరిలో నిలబడండి అనే నినాదాన్ని ఆయన ముందుకు తెస్తున్నారు. అయితే క్షేత్రస్థాయిలో పార్టీ కార్యకర్తల మానసిక స్థితి పూర్తిగా భిన్నంగా ఉంది. ఐదేళ్ల అధికార కాలంలో సంక్షేమ పథకాల బటన్ల పంపిణీకి ఇచ్చిన ప్రాధాన్యత పార్టీకి అండగా నిలిచిన ద్వితీయ శ్రేణి నాయకులకు, సాధారణ కార్యకర్తలకు దక్కలేదనే అసంతృప్తి వారిలో బలంగా ఉంది. పాలనా వ్యవహారాల్లో అక్రమాలు, దందాల ఆరోపణలు ఎదుర్కొన్న పెద్దలు ఇప్పుడు సురక్షితంగా ఇళ్లకే పరిమితం కాగా, క్షేత్రస్థాయిలో ప్రత్యర్థుల నుంచి వచ్చే రాజకీయ ఒత్తిళ్లను, కేసులను తామే భరించాల్సి వస్తోందని కేడర్ ఆందోళన చెందుతోంది. గతంలో పనులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న బిల్లులు రాకపోవడం, కొత్తగా సొంత జేబుల నుంచి లక్షలు ఖర్చుపెట్టి పోటీ చేసే ఆర్థిక స్తోమత లేకపోవడం కేడర్‌ను వెనుకడుగు వేసేలా చేస్తోంది. గ్రామస్థాయిలో ప్రత్యర్థులతో ఘర్షణ పడి ఆస్తులు, వ్యాపారాలను నష్టపోవడం కన్నా.. స్థానికంగా సర్దుబాటు రాజకీయాలు చేసుకోవడం లేదా మౌనంగా ఉండటమే మేలనే భావన వైఎస్సార్‌సీపీ శ్రేణుల్లో పెరుగుతోంది. క్షేత్రస్థాయిలో నాయకత్వం నుంచి ఎలాంటి రక్షణ భరోసా లభించనప్పుడు, కేవలం పార్టీ పరువు కాపాడటం కోసం తాము బలిపశువులం కాలేమనే చర్చ గ్రామాల్లో జరుగుతోంది. కార్యకర్తల్లోని ఈ నైరాశ్యాన్ని గుర్తించినందువల్లే జగన్ వారిని ప్రత్యేకంగా పిలిపించి బతిమాలుకోవాల్సిన పరిస్థితి తలెత్తిందని రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. అగ్రనాయకత్వం తన ఉనికిని చాటుకోవడానికి చూస్తున్న ఈ ప్రయత్నాలు క్షేత్రస్థాయి వాస్తవ పరిస్థితులకు పొంతన లేకుండా ఉన్నాయి

### ఏకగ్రీవం అనుకోవద్దు..

స్థానిక సంస్థల ఎన్నికలకు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులను సమాయత్తం చేసేలా ఆ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి రంగంలోకి దిగారు. రాష్ట్రంలో అన్ని స్థానాలకు పోటీచేయాలని, ఏ ఒక్క స్థానం ఏకగ్రీవం కాకూడదని ఇప్పటికే నియోజకవర్గ ఇంచార్జులకు ఆదేశాలిచ్చిన జగన్ రెడ్డి తాజాగా రాజమండ్రి రూరల్ నియోజకవర్గ కార్యకర్తల సమావేశంలో కీలక వ్యాఖ్యలు చేశారు. కొద్దిరోజుల్లో నిర్వహించే స్థానిక ఎన్నికల్లో విజయం కోసం వెన్నుపోటు పార్టీ అధ్యక్షుడు చంద్రబాబు పోలీసులను ప్రయోగిస్తారని, వారిని ఎదుర్కొని యుద్ధం చేయడానికి సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారుప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత ఉందని భావిస్తున్న ఆయన పార్టీ కేడర్ యుద్ధానికి సిద్దంగా ఉండాలని పిలుపునివ్వడం ద్వారా ఎన్నికల్లో రాజీ లేని పోరాటం చేస్తామని సంకేతాలు పంపుతున్నారని అంటున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు అవుతున్నా, ఎన్నికల హామీలు అమలు చేయడం లేదని, ఈ కారణంగా స్థానిక ఎన్నికల్లో ప్రజలు తమ పార్టీకి ఓటేస్తారని జగన్ రెడ్డి భావిస్తున్నట్లు చెబుతున్నారు కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు, క్షేత్రస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై జగన్ సుదీర్ఘంగా చర్చించారు. స్థానిక సంస్థల ఎన్నికలను సవాలుగా తీసుకోవాలని ఆయన కార్యకర్తలకు సూచించారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న కుట్రలను, ప్రజా వ్యతిరేక చర్యలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని, అదే సమయంలో గతంలో తమ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను గుర్తు చేయాలని పిలుపునిచ్చారు. “పార్టీకి కార్యకర్తలే వెన్నెముక. రానున్న స్థానిక ఎన్నికల్లో సత్తా చాటేందుకు ప్రతి ఒక్కరూ సమన్వయంతో పని చేయాలి. కూటమి ప్రభుత్వం సాగిస్తున్న ప్రజా వ్యతిరేక పాలనను ఎండగడుతూ, క్షేత్రస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయాలి” అని స్పష్టం చేశారు. నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా ఉండి, యుద్ధప్రాతిపదికన ఎన్నికలకు సిద్ధం కావాలని ఆయన దిశానిర్దేశం చేశారు. ఏడాదిలో పాదయాత్ర రాజమండ్రి రూరల్ నియోజకవర్గ కార్యకర్తల సమావేశంలో మాజీ ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి మరోసారి తన పాదయాత్రపై ప్రకటన చేశారు. ఏడాది తర్వాత తాను పాదయాత్ర చేస్తానని, ఎన్నికల వరకు ప్రజల్లోనే ఉంటానని స్పష్టం చేశారు. ఎన్నికల తర్వాత వైసీపీనే అధికారంలోకి వస్తుందని కార్యకర్తలకు భరోసా ఇచ్చారు. ప్రభుత్వంపై ప్రజా వ్యతిరేకత తీవ్రంగా ఉందని, అయితే స్థానిక ఎన్నికల్లో అది కనిపించకుండా ఉండేందుకు పోలీసులను వాడుకుంటారని ఆరోపించారు. ప్రభుత్వాన్ని ఎదుర్కొనేందుకు ప్రతి ఒక్కరూ యుద్ధం చేయడానికి సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు.

# భారత్‌తో రెండో టెస్టుకు శ్రీలంక జట్టులో భారీ మార్పులు.. ఐదుగురిపై వేటు!

- గాయం కారణంగా చండిమాల్ దూరం.. మరో నలుగురు ఆటగాళ్లపై వేటు
- ఆల్ రౌండర్ సహన్ అరాచ్చిగే, బ్యాటర్ కమిల్ మిషారాలకు జట్టులో చోటు
- భారత్-ఏ, లంక ప్రీమియర్ లీగ్‌లో రాణించడంతో యువ ఆటగాళ్లకు అవకాశం




భారత్‌తో జరిగిన తొలి టెస్టులో ఘోర పరాజయం చవిచూసిన శ్రీలంక, రెండో టెస్టు కోసం తమ జట్టులో భారీ మార్పులు చేసింది. శుభ్‌మన్ గిల్ నేతృత్వంలోని భారత జట్టుతో ఆదివారం కొలంబోలో ప్రారంభంకానున్న చివరి టెస్టు కోసం 14 మంది సభ్యులతో కూడిన జట్టును శ్రీలంక క్రికెట్ (ఎస్ఎల్‌సీ) ప్రకటించింది. ఈ జట్టు నుంచి ఐదుగురు ఆటగాళ్లను తప్పించి, దేశవాళీ క్రికెట్‌లో అద్భుతంగా రాణిస్తున్న ఇద్దరు యువ ఆటగాళ్లకు అవకాశం కల్పించింది. ఆల్ రౌండర్ సహన్ అరాచ్చిగే, బ్యాటర్ కమిల్ మిషారాలు తొలిసారిగా టెస్టు జట్టులో చోటు దక్కించుకున్నారు.

గాలేలో జరిగిన తొలి టెస్టులో గాయపడిన సీనియర్ ఆటగాడు దినేశ్ చండిమాల్ రెండో టెస్టుకు దూరమయ్యాడు. అతని స్థానంలో కాంకషన్ సబ్‌స్టిట్యూట్‌గా అరంగేట్రం చేసిన పసిందు సూరియబండార, తాను ఆడిన ఏకైక ఇన్నింగ్స్‌లో గోల్డెన్ డక్‌గా వెనుదిరగడంతో అతనిపైనా సెలక్టర్లు వేటు వేశారు. వీరితో పాటు ఓపెనర్ నిషాన్ మదుష్క, బౌలింగ్ ఆల్ రౌండర్ రమేశ్ మెండిస్, ఫాస్ట్ బౌలర్ దిల్షాన్ మదుష్కలను కూడా జట్టు నుంచి తప్పించారు.

ఇటీవల భారత్-ఏ జట్టుతో జరిగిన అనధికారిక టెస్టు సిరీస్‌లో శ్రీలంక-ఏ జట్టుకు నాయకత్వం వహించి అద్భుత ప్రదర్శన చేసిన సహన్ అరాచ్చిగేకు సెలక్టర్ల నుంచి పిలుపు అందింది. ఆ సిరీస్‌లో అతను రెండో మ్యాచ్‌లో 127 పరుగులు, తొలి మ్యాచ్‌లో 72 పరుగులు సాధించాడు. మొత్తం రెండు మ్యాచ్‌లలో 209 పరుగులతో తన జట్టు తరఫున టాప్ స్కోరర్‌గా నిలిచాడు. మరోవైపు, బ్యాటర్ కమిల్ మిషారా కూడా అద్భుతమైన ఫామ్‌లో ఉన్నాడు. ఇటీవల ముగిసిన లంక ప్రీమియర్ లీగ్ (ఎల్‌పీఎల్) 2026 సీజన్‌లో 9 ఇన్నింగ్స్‌లలో 411 పరుగులు చేసి సత్తా చాటాడు. ఇందులో గాలే గ్యాలంట్స్‌పై సాధించిన సెంచరీ కూడా ఉంది. అంతేగాక మేజర్ క్లబ్స్ టీ20 టోర్నీలో గురువారం కేవలం 72 బంతుల్లో 145 పరుగులు బాది తన విధ్వంసకర ఫామ్‌ను చాటుకున్నాడు.

**భారత్, శ్రీలంక మధ్య జరిగిన తొలి టెస్టులో టీమిండియా**

165 పరుగుల భారీ తేడాతో ఘన విజయం సాధించిన విషయం తెలిసిందే. ఆ మ్యాచ్‌లో భారత బ్యాటర్ దేవదత్ పడిక్కల్ (167) సెంచరీతో కదం తొక్కగా, ఎడమచేతి వాటం స్పిన్నర్ మానవ్ సుతార్ రెండు ఇన్నింగ్స్‌లలో కలిపి 10 వికెట్లు పడగొట్టి లంక పతనాన్ని శాసించాడు. ఈ నేపథ్యంలో సిరీస్‌ను సమం చేయాలనే లక్ష్యంతో శ్రీలంక పటిష్ఠమైన జట్టుతో బరిలోకి దిగుతోంది. ఇరు జట్ల మధ్య రెండో టెస్టు ఆగస్టు 23న ప్రారంభం కానుంది.

**రెండో టెస్టుకు 14 మంది సభ్యులతో శ్రీలంక జట్టు ఇదే..**

లహిరు ఉదార, కమిల్ మిషారా, పసిందు సూరియబండార, కమిందు మెండిస్ (వైస్ కెప్టెన్), ధనంజయ డి సిల్వా (కెప్టెన్), సహన్ అరాచ్చిగే, సోనాల్ దినుష, నిరోషన్ డిక్వెల్లా, కేశార నువంత, ప్రభాత్ జయసూర్య, మిలన్ రత్నాయకే, లహిరు కుమార, అశిత ఫెర్నాండో, విశ్వ ఫెర్నాండో.

# భారత మాజీ క్రికెటర్ జాకబ్ మార్టిన్‌కు భారీ ఊరట.. 22 ఏళ్ల తర్వాత క్లీన్ చిట్

- 22 ఏళ్ల నాటి క్రిమినల్ కేసులో మాజీ క్రికెటర్ జాకబ్ మార్టిన్‌కు విముక్తి
- ఢిల్లీ పాటియాలా హౌస్ కోర్టు నిర్దోషిగా ప్రకటిస్తూ కీలక తీర్పు
- కేసు కారణంగా రైల్వే ఉద్యోగం కోల్పోయి తీవ్ర ఒత్తిడికి గురయ్యానన్న మార్టిన్
- అంతర్జాతీయ క్రికెటర్ కావడం వల్లే తనను ఇరికించారని ఆరోపణ
- ఈ తీర్పు తన జీవితంలో ఒక పెద్ద మలుపు అని వ్యాఖ్య




భారత మాజీ క్రికెటర్, వడోదర నివాసి జాకబ్ మార్టిన్‌కు 22 ఏళ్ల సుదీర్ఘ న్యాయపోరాటంలో భారీ ఊరట లభించింది. ఆయనపై నమోదైన క్రిమినల్ కేసును కొట్టివేస్తూ ఢిల్లీలోని పాటియాలా హౌస్ కోర్టు నిర్దోషిగా ప్రకటించింది. ఆధారాలు లేకపోవడంతో మార్టిన్‌ను అన్ని ఆరోపణల నుంచి విముక్తి కల్పిస్తున్నట్లు న్యాయస్థానం స్పష్టం చేసింది. 2004లో యూకే పర్యటనకు వెళ్లిన ఒక క్రికెట్ జట్టు సభ్యుడు వీసా గడువు ముగిసినా అక్కడే ఉండిపోయి, నకిలీ ఇమ్మిగ్రేషన్ స్టాంప్‌తో భారత్‌కు తిరిగి వచ్చాడు. ఈ ఘటనపై నమోదైన ఎఫ్ఐఆర్‌లో చీటింగ్ (సెక్షన్ 420), ఫోర్జరీ (468), నకిలీ పత్రాలను ఉపయోగించడం (471), నేరపూరిత కుట్ర (120బీ) వంటి అభియోగాలతో పాటు పాస్‌పోర్ట్ చట్టంలోని సెక్షన్ 12 కింద కేసు నమోదు చేశారు. ఈ కేసు విచారణలో జాకబ్ మార్టిన్ పేరును చేర్చారు. అయితే, విచారణలో మార్టిన్‌కు వ్యతిరేకంగా ఎలాంటి విశ్వసనీయమైన సాక్ష్యాధారాలను ప్రాసిక్యూషన్ సమర్పించలేకపోయింది. నకిలీ యూకే స్టాంప్, ప్రయాణ ఏర్పాట్లు, ఆర్థిక లావాదేవీలలో మార్టిన్ పాత్ర ఉందని నిరూపించడంలో విఫలమైంది. అజ్వా స్పోర్ట్స్ క్లబ్‌పై ఆయనకు నియంత్రణ ఉందని చెప్పడానికి కూడా ఆధారాలు లేవని కోర్టు అభిప్రాయపడింది. సాక్షులు కూడా ఆరోపణలను ధ్రువీకరించకపోవడంతో మార్టిన్‌ను నిర్దోషిగా ప్రకటిస్తూ తీర్పు వెలువరించింది. ఈ తీర్పు అనంతరం జాకబ్ మార్టిన్ మీడియాతో మాట్లాడుతూ తన ఆవేదనను పంచుకున్నాడు. "2004లో నా జట్టు యూకే పర్యటనకు వెళ్లింది. ఒక ఆటగాడు తప్ప అందరూ తిరిగి వచ్చారు. అతను వీసా గడువు దాటి అక్కడే ఉండిపోయి, నకిలీ స్టాంపింగ్‌తో తిరిగి వస్తుండగా ఢిల్లీ విమానాశ్రయంలో పట్టుబడ్డాడు. అసలు ఎఫ్ఐఆర్‌లో నా పేరు లేదు. నేను అంతర్జాతీయ క్రికెటర్‌ను కావడం, నా పేరు పెద్దది కావడంతో విచారణ సమయంలో నన్ను ఈ కేసులో ఇరికించారు" అని మార్టిన్ తెలిపాడు. "ఈ 22 ఏళ్లలో నేను తీవ్రమైన ఒత్తిడిని ఎదుర్కొన్నాను. నా రైల్వే ఉద్యోగాన్ని కోల్పోయాను. బీసీసీఐ నుంచి కూడా ఎలాంటి స్పందన లేదు. ఇప్పుడు వచ్చిన ఈ క్లీన్ చిట్ నా జీవితానికి ఎంతో ఊరటనిచ్చింది. ఇది నా జీవితంలో ఒక పెద్ద మలుపు" అని అన్నాడు. కుడిచేతి వాటం బ్యాటర్ అయిన జాకబ్ మార్టిన్, భారత్ తరఫున 10 వన్డే మ్యాచ్‌లు ఆడి 158 పరుగులు చేశాడు.

# WTC ఫైనల్ రేసులో బిగ్ ట్విస్ట్ : 4 జట్లు ఔట్, డేంజర్‌లో మరో 3 టీమ్స్.. భారత్ సంగతేంటి?




**హైదరాబాద్ పెన్ పవర్:** లండన్ ది ఓవల్ మైదానంలో జూన్ 9వ తేదీ నుంచి జరిగే డబ్ల్యూటీసీ 2027 ఫైనల్ పోరుకు కౌంట్‌డౌన్ స్టార్ట్ అయింది. ఈసారి ఫైనల్ చేరాలంటే 65 శాతం పాయింట్లు సాధించడం తప్పనిసరి కావడంతో ఈ పోరు పీక్స్‌కి చేరింది. ఆస్ట్రేలియా, సౌతాఫ్రికా, న్యూజిలాండ్ టాప్--3లో పటిష్టంగా ఉంటే.. టీమిండియా ఐదో స్థానంలో కొనసాగుతుంది. మరోవైపు ఇంగ్లాండ్, పాకిస్తాన్, వెస్టిండీస్ ఆశలు గాల్లో కలవగా.. బంగ్లాదేశ్ ఊహించని విధంగా రేసులోకి దూసుకొచ్చింది. ఇండియా వరుసగా మరోసారి ఫైనల్ చేరాలంటే మిగిలిన 8 టెస్టులు అత్యంత కీలకంగా మారాయి. మరి టాప్--2లో నిలిచి ఆ ట్రోఫీని ముద్దాడే ఆ రెండు జట్లు ఏవో చూడాల్సిందే.

**వెస్టిండీస్ అవుట్.. పాకిస్తాన్, ఇంగ్లాండ్‌లకు డోర్లు క్లోజ్!**

ఈ సైకిల్‌లో వెస్టిండీస్ కథ ముగిసింది. 12 మ్యాచ్‌ల్లో రెండే గెలిచి విండీస్ 9వ స్థానానికి పడిపోయింది. ఇటు పాకిస్తాన్, ఇంగ్లాండ్ పరిస్థితి కూడా అంతే.. పాక్ ఫైనల్ రేసులో నిలవాలంటే మిగిలిన 7 టెస్టులు వరుసగా గెలవాల్సిందే. 13 మ్యాచ్‌లాడిన ఇంగ్లీష్ టీమ్ మిగిలిన ఎనిమిదింటిలో 8 నెగ్గినా అగ్రస్థానాలకు రావడం దాదాపు ఇంపాజిబుల్.. ఇక శ్రీలంక కూడా మిగిలిన 7 టెస్టులు తప్పక గెలవాల్సిన పరిస్థితి నెలకొంది.

**డార్విన్ టెస్టులో మాస్ కంబ్యాక్.. రేసులోకి బంగ్లాదేశ్:**

ఎవరూ ఊహించని రీతిలో బంగ్లాదేశ్ జట్టు పాయింట్ల పట్టికను షేక్ చేసేసింది. డార్విన్ టెస్టులో ఆస్ట్రేలియాను చిత్తు చేసి చారిత్రక విజయం సాధించడంతో 66.67 శాతం పాయింట్లతో నాలుగో స్థానానికి దూసుకెళ్లింది. చేతిలో ఇంకా ఏడు టెస్టులు ఉండటం వాళ్లకు ప్లస్ పాయింట్. దీంతో ఆసీస్, సఫారీలతో పాటు బంగ్లా కూడా ఫైనల్ బెర్త్ కోసం గట్టిగా పోటీ పడుతుంది.

**భారత్ WTC ఫైనల్ చేరే లెక్కలు ఇవే:**

ప్రస్తుతం భారత జట్టు 10 మ్యాచ్‌ల్లో 5 విజయాలతో 53.33 శాతం్రాజుతో ఐదో పొజిషన్లో కొనసాగుతుంది. మొత్తం 18 మ్యాచ్‌ల షెడ్యూల్‌లో భారత్ ముందు ఇంకా 8 టెస్టు మ్యాచులున్నాయి. ఈ మ్యాచ్‌ల్లో అత్యంత నిలకడగా రాణిస్తేనే టీమిండియాకు ఓవల్ లో జరిగే ఫైనల్ బెర్త్ దక్కుతుంది. మరి ఈ ఐదు జట్ల మధ్య జరగబోయే యుద్ధంలో ఏ టీమ్ ని విజయం వరిస్తుందో చూడాల్సిందే.

# ఆంధ్ర కింగ్ తాలూకా అమ్మాయికి పెద్ద ఛాన్స్..!

మిస్టర్ బచ్చన్ సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయం అయిన ముద్దుగుమ్మ భాగ్యశ్రీ బోర్సే. ఈ అమ్మడు మొదటి సినిమాతోనే దారుణమైన డిజాస్టర్‌ను చవిచూసినప్పటికీ తన అందంతో టాలీవుడ్‌లో ఆఫర్లు దక్కించుకుంది. రవితేజ మిస్టర్ బచ్చన్ ఫలితంతో సంబంధం లేకుండా ఈ అమ్మడు విజయ్ దేవరకొండ మూవీ 'కింగ్డమ్' లో నటించే అవకాశం దక్కించుకుంది. విజయ్ దేవరకొండ కి మంచి జోడీ అనిపించుకుంది. ఆ సినిమా సైతం డిజాస్టర్‌గా నిలిచింది. కింగ్డమ్ తర్వాత భాగ్యశ్రీ మళ్లీ తెలుగులో కనిపించే అవకాశం ఉందా అని చాలా మంది అనుమానం వ్యక్తం చేశారు. కానీ భాగ్యశ్రీ అందం ముందు ఆ ఫ్లాప్స్ నిలువలేక పోయాయి. రామ్ కి జోడీగా ఆంధ్ర కింగ్ తాలూకా సినిమాలో నటించే అవకాశం దక్కింది. ఆ సినిమాలోనూ అందంతో ఆకట్టుకుంది. అయితే సినిమా ఫలితం విషయంలోనూ భాగ్యశ్రీ కి కాస్త ఉపశమనం లభించినట్లు అయింది.

**రామ్ ఆంధ్ర కింగ్ తాలూకా మూవీ హీరోయిన్...**

ఆంధ్ర కింగ్ తాలూకా తర్వాత అఖిల్‌తో వచ్చిన 'లెనిన్' సినిమాతో భాగ్యశ్రీ మొదటి కమర్షియల్ హిట్‌ను దక్కించుకుంది. రెండు మూడు ఏళ్లుగా హిట్ కోసం ఎదురు చూస్తున్న ఈ అమ్మడికి లక్కీగా 2026లో ఆ హిట్ లభించింది. దాంతో వెంటనే టాలీవుడ్‌లో ఇబ్బడి ముబ్బడిగా సినిమా ఆఫర్లు వస్తాయని అంతా భావించారు. కానీ ఈ అమ్మడు టాలీవుడ్‌లో కంటే ముందు బాలీవుడ్‌లో సినిమా ఆఫర్‌ను దక్కించుకుంది. ప్రముఖ బాలీవుడ్ మీడియా సంస్థ ఈ విషయాన్ని తన కథనంలో పేర్కొనడం జరిగింది. భూషన్ కుమార్ నిర్మిస్తున్న భారీ చిత్రంలో భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్‌గా ఎంపిక అయిందని, ఆ సినిమాలో ఆదిత్య రాయ్ కపూర్ హీరోగా కనిపించబోతున్నట్లుగానూ ఆ కథనంలో పేర్కొన్నారు. ఆషికి 2, మలంగ్, లూడో చిత్రాల తర్వాత నిర్మాత భూషన్ కుమార్, ఆధిత్య రాయ్ కపూర్ జత కట్టడం ఇది ఐదో సారి. ఈ హిట్ కాంబోలో రాబోతున్న సినిమా కోసం భాగ్యశ్రీ ని హీరోయిన్‌గా ఎంపిక చేయడం విశేషం.



**ఆదిత్యరాయ్ కపూర్‌కి జోడీగా భాగ్య శ్రీ బోర్సే...**

ఈ సినిమాకు బాలీవుడ్ దర్శకుడు మిలాప్ మిలన్ జవేరి దర్శకత్వం వహించబోతున్నాడు. గత ఏడాది ఏక్ దీవానే కి దీవానియత్, మస్తీ 4, ఈ ఏడాది తేరా యార్ హూన్ మై సినిమాతో ప్రేక్షకులను అలరించిన దర్శకుడు మిలాప్ జవేరి దర్శకత్వంలో రూపొందబోతున్న మ్యూజికల్ అండ్ ఇంటెన్స్ వయెలెంట్ లవ్ స్టోరీ మూవీలో ఆదిత్యరాయ్ కపూర్, భాగ్యశ్రీ బోర్సే జంటగా కనిపించబోతున్నారు. ఈ మధ్య కాలంలో బాలీవుడ్‌లో మళ్లీ లవ్ స్టోరీలకు మంచి ఆధరణ లభిస్తోంది. మంచి కంటెంట్‌తో తీస్తే తప్పకుండా ఆధరిస్తారు అనే అభిప్రాయం ఉంది. అందుకే స్టార్ ప్రొడ్యూసర్స్ సైతం లవ్ స్టోరీల వెనుక పడుతున్నారు. అందులో భాగంగానే ఆదిత్యరాయ్ కపూర్, భాగ్యశ్రీ బోర్సేలతో నిర్మాత భూషన్ కుమార్ ఈ లవ్ అండ్ యాక్షన్ డ్రామా ప్లాన్ చేశాడు అంటూ బాలీవుడ్ వర్గాల వారు, మీడియా సర్కిల్స్ వారు మాట్లాడుకుంటున్నారు.

**రవితేజ మూవీ మిస్టర్ బచ్చన్‌తో ఎంట్రీ...**

మహారాష్ట్రాలోని ఛత్రపతి శంభాజీ నగర్‌లో జన్మించిన భాగ్యశ్రీ బోర్సే నైజీరియాలోని లాగోస్‌లో ఏడు ఏళ్లు విద్యను అభ్యసించింది. ఆ తర్వాత మోడలింగ్ పై ఆసక్తితో ముంబైలోని ఒక బిజినెస్ మేనేజ్‌మెంట్ స్కూల్‌లో జాయిన్ అయ్యి మోడలింగ్ పై శ్రద్ధ పెట్టింది. 2023లోనే యారియాన్ సినిమాతో భాగ్యశ్రీ ఇండస్ట్రీకి పరిచయం అయింది. కానీ ఆ సినిమా పెద్దగా భాగ్యశ్రీ కి గుర్తింపు తెచ్చి పెట్టలేదు. ఆ తర్వాత మరో హిందీ సినిమా అయిన చందు ఛాంపియన్‌లోనూ నటించింది. అయితే ఆ సినిమా సైతం భాగ్యశ్రీని హిందీలో హీరోయిన్‌గా నిలబెట్టడంలో సఫలం కాలేదు. బాలీవుడ్‌లో ఆఫర్ల కోసం ప్రయత్నాలు చేస్తూ, మోడలింగ్ చేస్తున్న సమయంలో భాగ్యశ్రీకి లక్కీగా రవితేజకు జోడీగా మిస్టర్ బచ్చన్ సినిమాలో నటించే అవకాశం దక్కింది. టాలీవుడ్‌లో 2024లో అడుగు పెట్టిన భాగ్యశ్రీ ఈ ఏడాది హిట్ కొట్టింది. టాలీవుడ్‌లో బిజీ అవుతుందని భావిస్తున్న సమయంలో హిందీలో ఆదిత్య రాయ్ కపూర్‌కి జోడీగా నటించే అవకాశం దక్కించుకుంది. ఈ బాలీవుడ్ మూవీతో హిట్ కొడితే భాగ్యశ్రీ తిరిగి టాలీవుడ్‌లో సినిమాలు చేస్తుందా లేదా అనే అనుమానాలు సైతం వ్యక్తం అవుతున్నాయి.





Printed By Published By Gantyada Apparao On Behalf Of Gantyada Apparao, Printed At Sri Sai Ganga Printers And Publishers, Flat No : 504, Bharat Towers, 5th Lane Dwarakanagar, Visakhapatnam, Andhra Pradesh - 530016, And Published At 1-17-1, Badeti Ramana Street, Near Mla House, 30th Word, Thadepalligudem , Editor Gantyada Apparao. PRGI Registration No. "APTEL/25/A2834, E-Mail : Editorpenpower@Gmail.Com, Mobile: 9059465965